02-08-2025, శనివారం
TELTEL/2016/69862
# జనం పవర్
తెలుగు దినపత్రిక
JANAM POWER
సంపుటి: 10 | సంచిక:66 | వెల:05




EDITOR:
BANDARI MARUTHI



## ఇప్పటికిప్పుడే ఉప ఎన్నికలు రావు

**దానికి ఇంకా సమయం ఉంది**
**స్పీకర్ చట్టపరిధిలోనే నిర్ణయాలు తీసుకుంటారు?**

**జనం పవర్, హైదరాబాద్ :**
దేశమంతా ఉత్కంఠతతో ఎదురుచూస్తున్న పార్టీ ఫిరాయింపుల కేసులో తీర్పు వెలువడింది. తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. మూడు నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. న్యాయస్థానమే వేటు వేయాలన్న పిటిషనర్ల విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ అంశంపై పార్టీ మారిన ..మిగతా 2లో




## అమెరికాపై ప్రతీకార చర్యలు ఉండవు

**కేంద్ర ప్రభుత్వ అధికారిక వర్గాలు**
**చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరిస్తామని వెల్లడి**




## ఏపీలో పోలీసు కానిస్టేబుల్ ఫలితాలు విడుదల

**జనం పవర్, హైదరాబాద్ :**
ఆంధ్రప్రదేశ్‌లో కానిస్టేబుల్ ఉద్యోగాల ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర హోం మంత్రి అనిత, ఏపీ డీజీపీ శుక్రవారం ఉదయం ఫలితాలను ప్రకటించారు. ఈ మేరకు ఫలితాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు. వైసీపీ హయాంలో 2022 అక్టోబర్‌లో నిర్వహించిన కానిస్టేబుల్ పరీక్షలు న్యాయ వివాదాల కారణంగా ..మిగతా 2లో

**సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో చర్చలు**
**ఉప ఎన్నికలు వస్తే ఏం చేయాలో సమాలోచనలు**
**కాళేశ్వరం నివేదికపై కూడా డిస్కషన్**
**బీసీ రిజర్వేషన్ బిల్లుకు సంబంధించి ఏం చేయాలని ఆలోచన**
**స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలా ముందుకెళ్లాలి?**
**సమావేశంలో పాల్గొన్న కేటీఆర్, హరీశ్ కీలక నేతలు**



# రంగంలోకి.. కేసీఆర్

**జనం పవర్, హైదరాబాద్ :**
తెలంగాణ రాజకీయ వేదికపై మరోసారి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) తన నాయకత్వ పాటవాన్ని చాటుతూ, పార్టీ కీలక నాయకులతో సమావేశమై రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై సమగ్ర చర్చలు జరిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, కాళేశ్వరం కమిషన్ నివేదిక, బీసీ రిజర్వేషన్ బిల్లు, స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ బలోపేతం వంటి కీలక అంశాలపై ఈ సమావేశంలో లోతైన విశ్లేషణ జరిగింది. ఈ సమావేశం బీఆర్ఎస్ కార్యకర్తల్లో కొత్త ఉత్తేజాన్ని నింపడమే కాక, తెలంగాణ రాజకీయాల్లో పార్టీ వ్యూహాత్మక చర్యలకు దిశానిర్దేశం చేసింది. ..మిగతా 2లో



## ఫిరాయింపుల్లో భయం భయం

**సుప్రీంకోర్టు సంచలన తీర్పుతో అలజడి**
**పార్టీ మారిన ఎమ్మెల్యేల మీద అనర్హతకు వేటు పడుతుందా?**
**మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకుంటారా?**
**స్పీకర్ ఏ నిర్ణయం తీసుకోబోతున్నారు.**
**ఎమ్మెల్యేలు పార్టీ మారినట్టు స్పష్టమైన ఆధారాలు**
**స్పీకర్ అనర్హత వేటు వేస్తారా? .. ఉప ఎన్నికలు వస్తాయా?**
**అసలు ఈ అంశంలో చట్టం ఏ చెబుతోంది.**

**జనం పవర్, హైదరాబాద్ :**
తెలంగాణ రాజకీయ రంగంలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన కీలక తీర్పు రాష్ట్రంలో అధికార, విపక్ష పార్టీల్లో ఆందోళన కలిగిస్తోంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హత విషయంలో ..మిగతా 3లో

## ఫిరాయింపు ఎమ్మెల్యేపైనా సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్ పార్టీ మరో కీలక నిర్ణయం






## ఫేస్‌బుక్ స్నేహం తెచ్చిన తంటా..

**జనం పవర్, హైదరాబాద్ :**
ఫేస్‌బుక్ స్నేహం యువకుడి ఆత్మహత్యాయత్నానికి దారితీసింది. గుడివాడ మండలం తటివర్రు గ్రామానికి చెందిన యువకుడు కొల్లూరి సంపత్‌కుమార్‌కు ఫేస్ బుక్ ద్వారా ఒక యువతి పరిచయమైంది. ఆమెతో నిత్యం ఫేస్‌బుక్ ద్వారా చాటింగ్ చేసేవాడు. ఇటీవల సదరు యువతి సంపత్‌తో సరిగా మాట్లాడడం లేదు. పెళ్లి చేసుకుందామని చెప్పిన ఆమె అందుకు నిరాకరించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై సంపత్‌కుమార్ గడ్డి మందు తాగి గురువారం ఆత్మహత్యకు యత్నించాడు. ..మిగతా 2లో



## నేడు వారణాసిలో మోడీ పర్యటన

**జనం పవర్, హైదరాబాద్ :**
ప్రధాని మోడీ శనివారం వారణాసిలో పర్యటించనున్నారు. రక్షా బంధన్‌కు ముందు దేశ వ్యాప్తంగా రైతులకు బహుమతి అందించనున్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 20వ విడత కింద 9.7 కోట్ల మంది రైతులకు రూ.20,500 కోట్లకు పైగా నిధులు బదిలీ చేయనున్నారు. ఉత్తరప్రదేశ్‌లోనే 2.3 కోట్లకు పైగా రైతులకు రూ.4,600 కోట్లు అందించనున్నారు. ఇందులో వారణాసిలో 2.21 లక్షల మంది రైతులకు రూ.48 కోట్లు ఇవ్వనున్నారు. ప్రతి ఏడాది అన్నదాతకు రూ.6 వేల చొప్పున మూడు విడతల్లో ఇవ్వనున్నారు. ..మిగతా 2లో




# ధర్మస్థలంలో అమానుషాలు

స్థానిక మతగురువులే కారకులా..
లైంగికంగా వేధించి బాలికలను చంపేశారా?
నిజమైన దోషులను గుర్తిస్తారా?
మృతుల్లో 12 నుంచి 15 ఏండ్ల బాలికలు




## హెచ్‌సీఏ అధ్యక్షుడిపై సస్పెన్షన్ వేటు

**కార్యదర్శులను సైతం తొలగించిన అసోసియేషన్**






Contact: 96181 81112

# హెచ్‌సీఏ అధ్యక్షుడిపై సస్పెన్షన్ వేటు

- **కార్యదర్శులను సైతం తొలగించిన అసోసియేషన్**

**జనం పవర్, హైదరాబాద్ :**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో మరో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. హెచ్‌సీఏలో అక్రమాలపై దర్యాప్తు జరుగుతున్న సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ రావును సస్పెండ్ చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అలాగే కార్యదర్శి దేవరాజ్, ఖజాంచి శ్రీనివాస్ రావులను పదవుల నుండి తొలగించినట్లు వెల్లడించింది. జూలై 28, 2025న నిర్వహించిన ఈ సమావేశంలో ఏకగ్రీవంగా ఈ నిర్ణయాలు తీసుకున్నామని అపెక్స్ కౌన్సిల్ స్పష్టం చేసింది. నిధుల దుర్వినియోగం, మోసం, అధికార దుర్వినియోగం వంటి తీవ్ర ఆరోపణల నేపథ్యంలో సీఐడీ, ఈడీ సంస్థలు ఇప్పటికే దర్యాప్తు జరుపుతున్నాయని తెలిపింది. అసోసియేషన్ నియమ నిబంధనల ప్రకారం పారదర్శకత, నైతిక విలువలకు కట్టుబడి ఉన్నామని, సంఘం న్యాయబద్ధతను కాపాడడానికే ఈ చర్యలు తీసుకున్నామని కౌన్సిల్ వెల్లడించింది. ఈ పరిణామాలతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో కొత్త చర్చలు మొదలయ్యాయి.

# ఇప్పటికిప్పుడే ఉప ఎన్నికలు రావు

(మొదటి పేజీ తరువాయి)

స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించారు.

"సుప్రీంకోర్టులో వచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం. స్పీకర్ నిర్ణయం ఎలా ఉంటుందో వేచి చూడాలి. సుప్రీంకోర్టు తీర్పు పూర్తి పాటవాన్ని చదవాల్సి ఉంది. స్పీకర్ కి మూడు నెలల సమయం ఇచ్చింది సుప్రీంకోర్టు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ కూడా న్యాయ పరిధిలోనే నిర్ణయాలు తీసుకుంటారని భావిస్తున్నాం. ఇప్పుడప్పుడే ఉప ఎన్నికలు వస్తాయి అని కొందరు ఏదైతే ఊహించుకుంటున్నారు అలాంటిదేమీ ఉండకపోవచ్చు. స్పీకర్ నిర్ణయం తర్వాత.. జాతీయ ఎన్నికల కమిషన్ ఉప ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా ఉప ఎన్నికల విషయంలో చాలా సమయం ఉంది. గతంలో టీఆర్ఎస్(ప్రస్తుత బీఆర్ఎస్) లోకి మారిన ఎమ్మెల్యేల కేసు సైతం సుప్రీంకోర్టులో ఇంకా కొనసాగుతోంది. స్పీకర్ నోటీసులకు ఇంకా మేము రిప్లై ఇవ్వలేదు సమయం కోరాం. వీటన్ని అన్ని పరిణామాల నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణ ఉంటుంది." అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు.

# నేడు వారణాసిలో మోడీ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

ఇక వారణాసిలో జరగనున్న బహిరంగ సభలో మోడీ ప్రసంగించనున్నారు. రూ.2,183.45 కోట్ల విలువైన 52 అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ప్రధాని మోడీ ఉదయం 10:30కి లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు స్వాగతం పలకనున్నారు.

# సుప్రీం తీర్పును గౌరవిస్తున్నాం

**జనం పవర్, హైదరాబాద్ :**

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత కేసుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పుపై స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టులో వచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. స్పీకర్ నిర్ణయం ఎలా ఉంటుందో వేచి చూస్తామన్నారు. సుప్రీంకోర్టు తీర్పు పూర్తి పాటవాన్ని చదవాల్సి ఉందని, స్పీకర్‌కు మూడు నెలల సమయం ఇచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ కూడా న్యాయపరంగా నిర్ణయాలు తీసుకుంటారని భావిస్తున్నామన్నారు. ఇప్పుడప్పుడే ఉప ఎన్నికలు వస్తాయని కొందరు ఊహిస్తున్నా అలాంటిదేమీ ఉండకపోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. స్పీకర్ నిర్ణయం తర్వాత జాతీయ ఎన్నికల కమిషన్ ఉప ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని, దీంతో ఉప ఎన్నికల విషయంలో చాలా సమయం ఉందని వ్యాఖ్యానించారు. అలాగే గతంలో బీఆర్ఎస్ లోకి మారిన ఎమ్మెల్యేల కేసు ఇంకా సుప్రీంకోర్టులో కొనసాగుతోందని ఆయన గుర్తు చేశారు. "స్పీకర్ నోటీసులకు ఇంకా మేము సమాధానం ఇవ్వలేదు, సమయం కోరాం. అన్ని పరిణామాల నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణ ఉంటుంది" అని శ్రీహరి స్పష్టం చేశారు.

# యూపీ సీఎం బయోపిక్.. సెన్సార్ నిరాకరణ

**జనం పవర్, హైదరాబాద్ :**

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'అజయ్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఎ యోగి' సెన్సార్ సమస్యల్లో చిక్కుకుంది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇవ్వడానికి నిరాకరించింది. యోగి ఆదిత్యనాథ్ పేరును చిత్రంలో అజయ్ మోహన్‌సింగ్‌గా మార్చి, నటుడు అనంత్ జోషి ఆ పాత్రలో నటించారు. రవీంద్ర గౌతమ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో యోగి గురువు మహంత్ పాత్రలో ప్రముఖ నటుడు పరేష్ రావల్ కనిపించనున్నారు. తాజాగా సెన్సార్‌కు వెళ్లిన ఈ సినిమాకు బోర్డు సర్టిఫికెట్ నిరాకరించడంతో, దర్శక నిర్మాతలు బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరగనుంది. విచారణ సందర్భంగా కోర్టు, ఎనిమిదేళ్లుగా ప్రజాదరణ పొందుతున్న నవల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రానికి సెన్సార్ ఎందుకు నిరాకరించారో బోర్డును ప్రశ్నించింది. పుస్తకానికి ఎటువంటి అభ్యంతరాలు లేవు, అదే ఆధారంగా తీసిన సినిమాకు ఎందుకు అడ్డుకట్టవేస్తున్నారని ప్రశ్నించింది. నిర్మాతల తరఫు న్యాయవాది, బోర్డు సభ్యులు సినిమా మొత్తాన్ని చూడకుండా కేవలం ట్రైలర్ ఆధారంగానే సర్టిఫికెట్ నిరాకరించారని కోర్టుకు వివరించారు. ఈ సందర్భంగా కోర్టు సెన్సార్ బోర్డుకు నోటీసులు జారీ చేస్తూ సమాధానం కోరింది.

# కోల్‌కతాలో బంగ్లాదేశ్ మోడల్ అరెస్ట్

**జనం పవర్, హైదరాబాద్ :**



కోల్‌కతాలో బంగ్లాదేశ్‌కు చెందిన మోడల్ శాంతా పాల్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. జాదవ్‌పూర్ ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఆమె అద్దెకు ఉంటూ, చెల్లుబాటు అయ్యే వీసా లేకుండానే భారత్‌లో నివసిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అరెస్టు సమయంలో ఆమె వద్ద నుంచి నకిలీ ఆధార్ కార్డులు, ఓటర్, రేషన్ కార్డు, పలు బంగ్లాదేశ్ పాస్‌పోర్టులు, రీజెంట్ ఎయిర్‌వేస్ (బంగ్లాదేశ్) ఉద్యోగి కార్డు, ఢాకా సెకండరీ ఎడ్యుకేషన్ అడ్మిట్ కార్డు స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా వేర్వేరు చిరునామాలతో నమోదు చేసిన రెండు భారతీయ ఆధార్ కార్డులు కూడా ఉన్నాయని అధికారులు తెలిపారు. గతేడాది చివర్లో ఆమె కోల్‌కతాకు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు.ఆమెను కోర్టులో హాజరుపరచగా ఆగస్టు 8 వరకు కస్టడీకి అప్పగించారు. శాంతా పాల్‌కి ఆధార్, ఓటర్, రేషన్ కార్డులు ఎలా జారీ అయ్యాయన్న దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఆధార్ సంబంధిత అధికారులతో చర్చలు జరుపుతున్నారు. నిందితురాలు బంగ్లాదేశ్‌లో నటిగా కూడా పని చేసినట్లు సమాచారం. అంతేకాకుండా అనేక టీవీ ఛానెల్స్‌లో యాంకర్‌గా, షోలలో పాల్గొంది. అలాగే అందాల పోటీల్లో కూడా పాల్గొందని పోలీసులు వెల్లడించారు.

# రంగంలోకి.. కేసీఆర్

- **సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో చర్చలు**
- **ఉప ఎన్నికలు వస్తే ఏం చేయాలో సమాలోచనలు**
- **కాళేశ్వరం నివేదికపై కూడా డిస్కషన్**
- **బీసీ రిజర్వేషన్ బిల్లుకు సంబంధించి ఏం చేయాలని ఆలోచన**
- **స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలా ముందుకెళ్లాలి?**
- **సమావేశంలో పాల్గొన్న కేటీఆర్, హరీశ్ కీలక నేతలు**

(మొదటి పేజీ తరువాయి)



**ఉప ఎన్నికలపై వ్యూహం**

సుప్రీంకోర్టు నోటీసుల నేపథ్యంలో త్వరలో రాష్ట్రంలో ఫిరాయించిన స్థానాల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.. దీంతోపాటు జుబ్లీహిల్స్ స్థానానికి కూడా ఉప ఎన్నికల జరిగే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికలకు సన్నద్ధమయ్యేందుకు నాయకులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. గత ఎన్నికల్లో ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని, క్షేత్రస్థాయిలో బలమైన వ్యూహం అవసరమని ఆయన నొక్కిచెప్పారు. స్థానిక నాయకులతో సమన్వయం, ఓటర్లతో నేరుగా సంప్రదింపులు, ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని కేసీఆర్ సూచించారు. ఈ ఉప ఎన్నికలు బీఆర్ఎస్ రాజకీయ బలాన్ని పరీక్షించే అవకాశంగా భావిస్తూ, పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడంపై ఆయన దృష్టి సారించారు.

**కాళేశ్వరం కమిషన్ నివేదిక: రాజకీయ కుట్రలపై ఆగ్రహం**

కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు (కేఎల్ఐఎస్) పై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ దర్యాప్తును కేసీఆర్ తీవ్రంగా ఖండించారు. ఈ కమిషన్ నివేదికను కాంగ్రెస్, బీజేపీలు రాజకీయ ఆయుధంగా ఉపయోగించి, బీఆర్ఎస్‌ను దెబ్బతీసే కుట్ర పన్నుతున్నాయని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతాంగానికి జీవనాడిగా నిలిచిందని, దీనిపై అపోహలు సృష్టించే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని కేసీఆర్ అన్నారు. మేడిగడ్డ బ్యారేజీ సంఘటనను ఆధారంగా చేసుకుని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేస్తోందని ఆయన విమర్శించారు. ఈ అంశంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి క్షేత్రస్థాయి కార్యకర్తలకు ఆదేశాలు జారీ చేశారు.

**బీసీ రిజర్వేషన్ బిల్లు: కాంగ్రెస్‌పై ఒత్తిడి**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని కేసీఆర్ గతంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఈ అంశం కీలకంగా చర్చకు వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు హామీ ఇచ్చిన 1 లక్ష కోట్ల రూపాయల బడ్జెట్‌ను 8,000 కోట్లకే పరిమితం చేసిందని, ఇది బీసీల పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యానికి ఆధారమని కేసీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో బీసీలకు ఎక్కువ సీట్లు కేటాయించడం, 27 మంది బీసీలను కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించడం, విదేశీ విద్యకు ఆర్థిక సహాయం అందించడం వంటి చర్యలను ఆయన గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లును తీసుకురాకపోతే, కాంగ్రెస్ హామీలను ప్రజల ముందు బహిర్గతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

స్థానిక సంస్థల ఎన్నికలు: గ్రామీణ ఓటర్లపై దృష్టి

స్థానిక సంస్థల ఎన్నికలు బీఆర్ఎస్‌కు కీలకమైన రాజకీయ అవకాశంగా భావించబడుతోంది. ఈ సమావేశంలో, గ్రామీణ ఓటర్లలో బీఆర్ఎస్ బలాన్ని పెంచేందుకు వ్యూహాలు రూపొందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని, గ్రామ పంచాయతీలకు తగిన నిధులు కేటాయించడం లేదని కేసీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో గ్రామాలు జాతీయ స్థాయిలో అవార్డులు సాధించాయని, కానీ ఇప్పుడు గ్రామ పంచాయతీలు డీజిల్ కొనుగోలు చేయలేని దుస్థితిలో ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపును సాధించాలని కేసీఆర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

పార్టీ బలోపేతం: కేసీఆర్ వ్యూహాత్మక చర్యలు

గత శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత, బీఆర్ఎస్‌లో అంతర్గత సమస్యలు, నాయకత్వ విభేదాలు తలెత్తాయనే విమర్శల నడుమ, కేసీఆర్ ఈ సమావేశంలో పార్టీ ఐక్యతను నొక్కిచెప్పారు. కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని పెంచడానికి, గత తప్పులను సరిదిద్దుకుని, ప్రజలతో నేరుగా మమేకమయ్యే కార్యక్రమాలను చేపట్టాలని ఆయన ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో జరిగే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే వికారాబాద్, ఎల్లంతకుంట, తంగళ్లపల్లి, బోయినపల్లి వంటి ప్రాంతాల్లో పర్యటనల ద్వారా కేసీఆర్ కార్యకర్తలను ఉత్తేజపరిచారు, ఇది పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్‌ను నింపింది.

**రాజకీయ విశ్లేషణ**

కేసీఆర్ నాయకత్వంలో జరిగిన ఈ సమావేశం, బీఆర్ఎస్ రాజకీయ వ్యూహంలో కీలకమైన మలుపును సూచిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి ఉన్న నేపథ్యంలో, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ లక్ష్యంగా పెట్టుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలను తిప్పికొట్టడం, బీసీ రిజర్వేషన్ల వంటి సామాజిక న్యాయ అంశాలను లేవనెత్తడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామీణ ఓటర్లను ఆకర్షించడం ద్వారా పార్టీ తన బలాన్ని పునరుద్ధరించుకోవాలని భావిస్తోంది. అయితే, కాంగ్రెస్, బీజేపీలతో పోటీ, అంతర్గత సవాళ్లను అధిగమించడం వంటి అడ్డంకులు బీఆర్ఎస్ ముందున్నాయి. కేసీఆర్ వ్యూహాత్మక నాయకత్వం, రాష్ట్రంలో గతంలో తెలంగాణ ఉద్యమాన్ని విజయవంతం చేసిన చరిత్ర ఈ సందర్భంలో పార్టీకి బలాన్ని ఇస్తాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ముగింపు**

కేసీఆర్ నాయకత్వంలో జరిగిన ఈ సమావేశం, బీఆర్ఎస్ తన రాజకీయ ఉనికిని బలోపేతం చేసుకునే దిశగా కీలకమైన అడుగుగా నిలిచింది. ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించడం, కాళేశ్వరం, బీసీ రిజర్వేషన్ వంటి అంశాలపై కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించడం ద్వారా, బీఆర్ఎస్ తన రాజకీయ పునరుజ్జీవనానికి బాటలు వేస్తోంది. కేసీఆర్ అనుభవజ్ఞత, వ్యూహాత్మక చర్యలు ఈ లక్ష్య సాధనలో ఎంతవరకు ఫలిస్తాయనేది రాబోయే ఎన్నికల్లో తేలనుంది.

# అమెరికాపై ప్రతీకార చర్యలు ఉండవు

- **కేంద్ర ప్రభుత్వ అధికారిక వర్గాలు**
- **చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరిస్తామని వెల్లడి**

(మొదటి పేజీ తరువాయి)



భారత్ మిత్ర దేశమంటూనే.. 25శాతం సుంకంతో పాటు పెనాల్టీలు కూడా విధించారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ . ఈ టారిఫ్‌ల మోతకు భారత్ ప్రతీకారం తీర్చుకుంటుందనే ఊహాగానాలను అధికార వర్గాలు కొట్టిపడేశాయి. ఇరుదేశాల ప్రయోజనాలకు అనుగుణంగా జరిగే చర్చల్లో నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొంది. ట్రంప్ సుంకాలపై భారత్ ఎలాంటి ప్రతీకార చర్యలు తీసుకోదని అధికార వర్గాలు స్పష్టంచేశాయి. మౌనమే సరైన సమాధానమని.. ఏదైనా చర్చల ద్వారానే పరిష్కరిస్తామని తెలిపాయి. ట్రంప్ టారిఫ్‌లు భారత ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని పలువురు నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అయితే, అధికార వర్గాలు దీన్ని కొట్టిపారేశాయి. తొలిగా అణు పరీక్షలు చేసినప్పుడు కూడా మనపై ఇలాంటి ఆంక్షలే విధించారని.. ఆ సమయంలో మనది చాలా చిన్న ఆర్థికవ్యవస్థ అని అన్నారు. ప్రస్తుతం భారత ఆర్థికవ్యవస్థ చాలా అభివృద్ధి చెందిందని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. చర్చలు కొనసాగుతున్నాయని.. ఇరుదేశాల ప్రయోజనాలకు ఉపయోగపడే పరిష్కారానికి సిద్ధంగా ఉన్నామని వివరించారు.

**కలిసి మునగనీయండి: ట్రంప్**

అమెరికాతో చర్చలు కొనసాగుతున్నాయని, భారత్ ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తుందని అటు కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ కూడా పార్లమెంటులో పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలు, చిన్న పరిశ్రమలు, రైతులు, వ్యాపారుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందనే కారణంతో సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈసందర్భంగా ఇరుదేశాలపై ఆయన విరుచుకుపడ్డారు. రష్యాతో భారత్ ఏం చేస్తుందన్న విషయాన్ని అసలు పట్టించుకోబోమన్నారు. ఇద్దరూ వారి మృత ఆర్థిక వ్యవస్థలను దిగజార్చుకోనీయండని, కలిసి మునగనీయండని వ్యాఖ్యానించారు. ఇక, ఈ వ్యాఖ్యలను లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా సమర్థించారు. భారత ఆర్థికవ్యవస్థ పతనమైందని, అది ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు తప్ప ప్రతిఒక్కరికీ తెలుసని ఎద్దేవా చేశారు.

# ఫేస్‌బుక్ స్నేహం తెచ్చిన తంటా..

(మొదటి పేజీ తరువాయి)

ఫేస్‌బుక్ స్నేహం యువకుడి ఆత్మహత్యాయత్నానికి దారితీసింది. గుడివాడ మండలం తటివర్రు గ్రామానికి చెందిన యువకుడు కొల్లూరి సంపత్‌కుమార్‌కు ఫేస్ బుక్ ద్వారా ఒక యువతి పరిచయమైంది. ఆమెతో నిత్యం ఫేస్‌బుక్ ద్వారా చాటింగ్ చేసేవాడు. ఇటీవల సదరు యువతి సంపత్‌తో సరిగా మాట్లాడడం లేదు. పెళ్లి చేసుకుందామని చెప్పిన ఆమె అందుకు నిరాకరించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై సంపత్‌కుమార్ గడ్డి మందు తాగి గురువారం ఆత్మహత్యకు యత్నించాడు. విషయం అతని స్నేహితుడు యువరాజుకు తెలిపాడు. దీంతో అతనిని వెంటనే ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని స్నేహితుడు యువరాజుకు తెలిపాడు. దీంతో అతనిని వెంటనే ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేపైనా సుప్రీంకోర్టుకు

# బీఆర్ఎస్ పార్టీ మరో కీలక నిర్ణయం

**జనం పవర్, హైదరాబాద్ :**

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో.. తమ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్సీలపై కూడా సుప్రీంకోర్టులో కేసు వేయాలని భారత రాష్ట్ర సమితి నిర్ణయించినట్లు తెలిసింది. ఎర్రవల్లి నివాసంలో భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్‌తో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి తదితరులు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, అనంతర పర్యవసానాలపై కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. తీర్పు ప్రతి వెలువడిన అనంతరం... న్యాయవాదులతో క్షుణ్ణంగా అధ్యయనం చేయించాలని కేసీఆర్ సూచించినట్లు తెలిసింది. మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశాలివ్వడంతో.. స్పీకర్ నిర్ణయం తీసుకోక తప్పదని, ఈ విషయంలో భారత రాష్ట్ర సమితి గట్టిగా పోరాడిందని కేసీఆర్ పేర్కొన్నట్లు సమాచారం. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్సీలపైనా సుప్రీంకోర్టులో కేసు వేద్దామని నిర్ణయానికొచ్చినట్లు తెలిసింది. గోదావరిబనకచర్ల ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించేది లేదని, అవసరమైతే దీనిపై సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిద్దామని కేసీఆర్ స్పష్టం చేసినట్లు సమాచారం. 'కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైంది. కొన్ని ముఖ్యమైన విషయాల్లో ప్రభుత్వాన్ని భారత రాష్ట్ర సమితి ఆత్మరక్షణలో పడేసింది. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై న్యాయపోరాటంలో పైచేయి సాధించడం, లగచర్లలో రైతుల భూములను లాక్కోవడాన్ని నిలువరించడం, మూసీ ప్రాజెక్టు పేరిట రూ.లక్షన్నర కోట్ల ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అడ్డుకోవడం, అదానీ నుంచి తీసుకున్న చెక్కును ప్రభుత్వం వెనక్కి ఇవ్వడం... తదితర అంశాల్లో ప్రభుత్వాన్ని ప్రభావితం చేయగలిగాం. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారు.




స్థానిక సంస్థల ఎన్నికల్లో కచ్చితంగా భారత రాష్ట్ర సమితి జయభేరి మోగిస్తుంది' అని కేసీఆర్ పేర్కొన్నట్లు తెలిసింది.

# ఏపీలో పోలీసు కానిస్టేబుల్ ఫలితాలు విడుదల

**జనం పవర్, హైదరాబాద్ :**

ఆలస్యమైనప్పటికీ, నేడు ఫలితాలు వెలువడ్డాయి. 2022 జనవరి 22న జరిగిన ప్రిలిమినరీ రాత పరీక్ష ద్వారా మొత్తం 6,100 కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేయడానికి ప్రక్రియ ప్రారంభమైంది. పరీక్షల కోసం మొత్తం 5,09,579 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 5,03,487 మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. వారిలో 4,58,219 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ప్రిలిమినరీలో అర్హత మార్కులను ఓసీలకు 40 శాతం, బీసీలకు 35 శాతం, ఎస్సీ, ఎస్టీ, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు 30 శాతం గా నిర్ణయించారు. ఇటీవల జరిగిన పరీక్షకు 37,600 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 33,921 మంది ఉత్తీర్ణులు కాగా, అందులో 29,211 మంది పురుషులు, 4,710 మంది మహిళలు అర్హత సాధించారు. ఓఎంఆర్ షీట్లు జూలై 12, 2025 వరకు డౌన్‌లోడ్‌కు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.



# నాంపల్లి కోర్టుకు దగ్గుబాటి ఫ్యామిలీ

- **ఫిల్మ్ నగర్ దక్కన్ కిచెన్ కూల్చివేత కేసులో నేడు విచారణ**

**జనం పవర్, హైదరాబాద్ :**

హైదరాబాద్ ఫిల్మ్ నగర్‌లోని దక్కన్ కిచెన్ కూల్చివేత కేసు నేడు నాంపల్లి కోర్టులో విచారణకు రానుంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే ప్రముఖ సినీ నటులు దగ్గుబాటి వెంకటేశ్, రానా, నిర్మాత సురేష్ బాబుపై కేసు నమోదు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాల మేరకు ఫిల్మ్ నగర్ పోలీసులు వీరిపై 448, 452, 458, 120 బీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అయితే విచారణకు హాజరుకావడంలో ఆలస్యం చేస్తూ వస్తున్నందుకు కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఆగస్టు 1న తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయినా నేటి విచారణకు ఈ ముగ్గురు హాజరవుతారా లేదా అన్నదానిపై సందిగ్ధత నెలకొంది. దీంతో కేసు మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. నందకుమార్‌కు చెందిన దక్కన్ కిచెన్ స్థలంపై దగ్గుబాటి కుటుంబంతో వివాదం చెలరేగింది. సిటీ సివిల్ కోర్టులో కేసు నడుస్తుండగానే 2022 నవంబరులో జీహెచ్ఎంసీ సిబ్బంది, బౌన్సర్ల సహాయంతో హోటల్‌ను పాక్షికంగా ధ్వంసం చేశారు. హైకోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా 2024 జనవరిలో హోటల్‌ను పూర్తిగా కూల్చేశారు. ఈ నేపథ్యంలో నందకుమార్ నాంపల్లి కోర్టును ఆశ్రయించగా, దగ్గుబాటి కుటుంబంపై కేసు నమోదు చేసి విచారణ జరపాలని పోలీసులకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. తనకు జరిగిన అన్యాయం పై నందకుమార్ ఎప్పటి నుంచో న్యాయపోరాటం కొనసాగిస్తున్నారు.కాగా, నేడు విచారణలో దగ్గుబాటి కుటుంబం కోర్టు ముందు హాజరై తమ వాదనలు వినిపిస్తారా? లేక మళ్లీ ఆదేశాలను ఉల్లంఘిస్తారా? అన్నదానిపై ఆసక్తి నెలకొంది.



# ఇగ్లూలు కాదు.. బొగ్గుల బట్టీలు

**జనం పవర్, హైదరాబాద్ :**

అతిశీతల ప్రాంతాల్లో.. ప్రజలు నివసించే మంచు గృహాలను ఇగ్లూలు అంటారనే సంగతి తెలిసిందే. అచ్చం వాటిని పోలి ఉన్న నిర్మాణాలు నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బిజినవేముల గ్రామ సమీపంలో కనిపించాయి. ఇలా ఎందుకు నిర్మించారని ఆరా తీయగా బొగ్గుల బట్టీలని తెలిసింది. బొగ్గుల వ్యాపారం చేస్తూ ఉపాధి పొందుతున్న వారు.. ఇటుకలు, మట్టితో అర్ధగోళాకారంలో బట్టీలు నిర్మించారు. వాటికి కిటికీ పరిమాణంలో ద్వారం ఏర్పాటు చేశారు. దీని ద్వారా వీటిలోకి కలప, మొద్దులు వేసి నిప్పంటించి ద్వారాన్ని మట్టితో పూడ్చేస్తారు. అవి కాలి బొగ్గుగా మారాక బయటకు తీసి విక్రయిస్తున్నారు.





# మహిళా సిబ్బంది సామర్థ్యాన్ని పెంపొందించాలి

- **అదనపు డీజీపీ అబిలాష బిస్త్**

**జనం పవర్, పెద్దపల్లి ఆగస్టు 1:**

రామగుండం కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిమిత్తంగా అదనపు డీజీపీ, ఆర్.బి.వి.ఆర్.ఆర్. పోలీస్ అకాడమీ, డైరెక్టర్. అబిలాష బిస్త్ ఈరోజు పెద్దపల్లి డీసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏఆర్ సాయిదా దళం గౌరవ వందనంతో డీసీపీ కరుణాకర్ స్వాగతం పలికారు. ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ స్టేషన్లలో నిర్వహించే విధులు,పోస్టింగ్‌లు,సెలవుల విధానం,వ్యక్తిగత సమస్యలపై చర్చించారు. మహిళా సిబ్బంది కూడా పురుషులతో సమానంగా అన్ని విధులకు సిద్ధంగా ఉండాలని డైరెక్టర్ అబిలాష బిస్త్ తెలిపారు. ప్రత్యేకంగా పిటిషన్ విచారణ,బ్లూ కోట్స్,నైట్ డ్యూటీలు,కోర్టు మరియు స్టేషన్ విధుల్లో వారు చురుకుగా పాల్గొనాలని, మహిళా సిబ్బందికి స్కూటర్లు ఏర్పాటు చేయాలని, డ్రైవింగ్ శిక్షణ కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్,పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్,సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి,గోదావరిఖని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, 2 టౌన్ సీఐ ప్రసాద్ రావు,ఇతర ఎస్ఐలు పాల్గొన్నారు.

# ధర్మస్థలంలో అమానుషాలు

- **స్థానిక మతగురువులే కారకులా..**
- **లైంగికంగా వేధించి బాలికలను చంపేశారా?**
- **నిజమైన దోషులను గుర్తిస్తారా?**
- **మృతుల్లో 12 నుంచి 15 ఏండ్ల బాలికలు**

**జనం పవర్, హైదరాబాద్ :**



కర్ణాటకలోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రమైన ధర్మస్థలంలో ఇటీవల వెలుగులోకి వచ్చిన భయానక ఘటనలు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించాయి. ఈ ప్రాంతంలో నూరుకు పైగా మహిళలు, చిన్నారులు అనుమానాస్పదంగా అదృశ్యమైనట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఈ ఘటనలకు సంబంధించి అస్థిపంజరాలు లభ్యమవడం, స్థానిక కార్మికుడి షాకింగ్ వెల్లడి ఈ వ్యవహారాన్ని మరింత రహస్యమయం చేశాయి.

**ఘటన వివరాలు**

జులై 2025లో ధర్మస్థలంలో పనిచేసే ఒక కార్మికుడు సంచలన వాంగ్మూలం ఇచ్చాడు. తాను నూరుకు పైగా శవాలను పూడ్చినట్లు, వాటిలో కొన్ని పాఠశాల యూనిఫాంలో ఉన్న చిన్నారులవని, అందులో 1215 ఏళ్ల బాలికలు కూడా ఉన్నారని వెల్లడించాడు. ఈ వెల్లడి తర్వాత పోలీసులు ఒక శవాన్ని తవ్వి బయటకు తీశారని, దానిపై డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారని వార్తలు వెలువడ్డాయి. ఈ ఘటనలు ధర్మస్థలంలో దీర్ఘకాలంగా జరుగుతున్న లైంగిక వేధింపులు, హత్యలకు సంబంధించినవని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**అరాచకానికి కారకులు**

ఈ ఘటనల వెనుక ఎవరు ఉన్నారనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇంకా లభించలేదు. అయితే, స్థానిక మత గురువులు, సామియార్లు ఈ అరాచకాలకు కారణమని కొన్ని సోషల్ మీడియా పోస్టులు ఆరోపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే, ఆధ్యాత్మికత పేరుతో నడిచే కొన్ని సంస్థలు లైంగిక వేధింపులు, హత్యలకు పాల్పడి ఉండవచ్చని సూచనలు ఉన్నాయి. అయితే, ఈ విషయంపై అధికారిక నిర్ధారణ ఇంకా రాలేదు.

**అస్థిపంజరాల ఆవిష్కరణ: దేనికి సంకేతం?**

ధర్మస్థలంలో లభ్యమైన అస్థిపంజరాలు ఈ ప్రాంతంలో జరిగిన దీర్ఘకాలిక నేరాలకు సంకేతంగా నిలుస్తున్నాయి. ఈ శవాలు లైంగిక వేధింపులు, హత్యల తర్వాత పూడ్చబడ్డాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలు స్థానిక సమాజంలో మహిళలు, చిన్నారులపై జరిగిన దారుణ అత్యాచారాలను, హత్యలను సూచిస్తున్నాయి. ఈ అస్థిపంజరాల ఆవిష్కరణ దీర్ఘకాలంగా దాచిపెట్టిన నేరాలను బయటపెట్టడంలో కీలకమైన అడుగుగా భావిస్తున్నారు.

**పోలీసుల పాత్ర**

ఈ ఘటనలపై పోలీసులకు ఎంతవరకు సమాచారం ఉందనే విషయం వివాదాస్పదంగా మారింది. కొందరు స్థానికులు ఈ నేరాల గురించి గతంలోనే సమాచారం ఉన్నప్పటికీ, పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలు బయటపడిన తర్వాత కర్ణాటక ప్రభుత్వం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (ఎస్ఐటీ)ని ఏర్పాటు చేసింది. ఈ బృందం డీఎన్ఏ గుర్తింపు, శవాల తవ్వకాలు, నిందితుల గుర్తింపు కోసం పనిచేస్తోంది. అయితే, పోలీసుల నిర్లక్ష్యం లేదా స్థానిక ప్రభావశీల వ్యక్తుల ఒత్తిడి వల్ల ఈ నేరాలు ఇంతకాలం బయటపడలేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

**సామాజిక, సాంస్కృతిక కోణం**

ధర్మస్థలం ఒక పవిత్ర ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందిన ప్రాంతం. ఇక్కడ జరిగిన ఈ ఘటనలు సమాజంలో ఆధ్యాత్మికత పేరుతో జరిగే దుర్వినియోగాలపై ప్రశ్నలు లేవనెత్తాయి. మతపరమైన నమ్మకాలను ఆసరాగా చేసుకుని కొందరు నేరాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఈ ఘటనతో మరింత బలపడ్డాయి. మహిళలు, చిన్నారులపై జరిగిన ఈ దాడులు సమాజంలో లింగ వివక్ష, అసమానతలను కూడా బహిర్గతం చేస్తున్నాయి.

**చట్టపరమైన కోణం**

ఈ ఘటనలపై చట్టపరమైన చర్యలు వేగవంతమవుతున్నాయి. ఎస్ఐటీ ఏర్పాటుతో పాటు, విజ్ఞానులు, ఇంజనీర్ల సహాయంతో శవాల గుర్తింపు కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్థానిక నటి రమ్యా, నటుడు రాకేశ్ అడిగ వంటి ప్రముఖులు న్యాయయుత తనిఖీల కోసం డిమాండ్ చేశారు. ఈ ఘటనలకు సంబంధించి దోషులను కఠినంగా శిక్షించాలని సమాజంలోని వివిధ వర్గాల నుంచి ఒత్తిడి పెరుగుతోంది.

**మీడియా, ప్రజా స్పందన**

సోషల్ మీడియాలో ఈ ఘటనపై తీవ్రమైన ఆగ్రహం వ్యక్తమవుతోంది. హిందూ భక్తులపై జరిగిన ఈ దాడులను ఖండిస్తూ, దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ అనేక పోస్టులు వెలువడ్డాయి. మీడియా సంస్థలు ఈ ఘటనను విస్తృతంగా కవర్ చేస్తూ, బాధితులకు న్యాయం జరగాలని కోరుతున్నాయి. స్థానికులు కూడా ఈ నేరాల గురించి గతంలోనే విన్నామని, అయితే ఇప్పుడు బయటకు వచ్చిన వివరాలు షాకింగ్‌గా ఉన్నాయని చెబుతున్నారు.

**దారుణ అత్యాచారాలు**

ధర్మస్థలంలో జరిగిన ఈ ఘటనలు మానవ హక్కుల ఉల్లంఘనకు, మహిళలు, చిన్నారులపై జరిగిన దారుణ అత్యాచారాలకు స్పష్టమైన ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఈ ఘటనల వెనుక ఉన్న నిజమైన దోషులను గుర్తించి, వారిని చట్టం ముందు నిలబెట్టడం ఇప్పుడు అత్యవసరం. పోలీసులు, ప్రభుత్వం, సమాజం కలిసి ఈ ఘటనలపై న్యాయయుతంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలి. ఈ ఘటన సమాజంలో మహిళల భద్రత, ఆధ్యాత్మిక సంస్థల జవాబుదారీతనంపై మరింత చర్చకు దారితీస్తుందని ఆశిస్తున్నాం.

# ఫిరాయింపుల్లో భయం భయం

**సుప్రీంకోర్టు సంచలన తీర్పుతో అలజడి**
**పార్టీ మారిన ఎమ్మెల్యేల మీద అనర్హతకు వేటు పడుతుందా?**
**మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకుంటారా?**
**స్పీకర్ ఏ నిర్ణయం తీసుకోబోతున్నారు.**
**ఎమ్మెల్యేలు పార్టీ మారినట్టు స్పష్టమైన ఆధారాలు**
**స్పీకర్ అనర్హత వేటు వేస్తారా?**
**ఉప ఎన్నికలు వస్తాయా?**
**అసలు ఈ అంశంలో చట్టం ఏ చెబుతోంది.**



**జనం పవర్, హైదరాబాద్ :**

స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించడంతో రాజకీయ వర్గాల్లో కలవరం నెలకొంది. ఈ తీర్పు ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయడమే కాక, రాష్ట్రంలో ఉప ఎన్నికల అవకాశాన్ని కూడా తెరపైకి తెచ్చింది. ఈ అంశంపై అన్ని కోణాల్లో విశ్లేషణాత్మకంగా పరిశీలిద్దాం.

**సుప్రీంకోర్టు తీర్పు: ఒక విశ్లేషణ**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచి, కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం జులై 31, 2025న కీలక తీర్పు ఇచ్చింది. మూడు నెలల్లోగా అనర్హతపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించిన సుప్రీంకోర్టు, న్యాయస్థానమే అనర్హత వేటు వేయాలన్న బీఆర్ఎస్ విజ్ఞప్తిని తిరస్కరించింది. ఈ తీర్పు రాజకీయ ఫిరాయింపులపై దేశవ్యాప్తంగా ఉన్న చట్టపరమైన చర్చకు మరింత ఊతమిచ్చింది. స్పీకర్ నిర్ణయంపై హైకోర్టు జోక్యంపై అసెంబ్లీ సెక్రటరీ తరఫున వాదించిన న్యాయవాది ముకుల్ రోహత్గీ అభ్యంతరం వ్యక్తం చేయగా, ఆర్టికల్ 142 ప్రకారం న్యాయస్థానాలు నిర్ణయాత్మక శక్తిని కలిగి ఉన్నాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

**ఫిరాయించిన ఎమ్మెల్యేలు: ఎవరు, ఎందుకు?**

పార్టీ మారిన ఎమ్మెల్యేల జాబితాలో దానం నాగేందర్ (ఖైరతాబాద్), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), తెల్లం వెంకట్రావు (భద్రాచలం), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్‌చెరు), కాలె యాదయ్య (చేవేళ్ల), ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), డాక్టర్ సంజయ్ (జగిత్యాల), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి), పోచారం శ్రీనివాస్ రెడ్డి (బాన్సువాడ) ఉన్నారు. ఈ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించింది.ఫిరాయింపులకు కారణాలుగా రాజకీయ అవకాశాలు, అధికార పార్టీలో ఉన్న ఆకర్షణ, స్థానిక సమీకరణాలు చెప్పబడుతున్నాయి. అయితే, బీఆర్ఎస్ నేతలు ఈ ఫిరాయింపుల వెనుక అధికార దుర్వినియోగం, ఆర్థిక లావాదేవీలు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై స్పష్టమైన ఆధారాలు లేనప్పటికీ, బీఆర్ఎస్ సమర్పించిన ఫిరాయింపు ఆధారాలను స్పీకర్ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

**స్పీకర్ నిర్ణయం: అంచనాలు, అవకాశాలు**

స్పీకర్ ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం (1985) ప్రకారం, సభ్యుడు స్వచ్ఛందంగా పార్టీని వీడినప్పుడు లేదా పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా ఓటు వేసినప్పుడు అనర్హత వేటు వేయవచ్చు. అయితే, స్పీకర్ నిర్ణయం న్యాయసమీక్షకు లోబడి ఉంటుందని 1993లో కిహోటో హోలాహాన్ కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. స్పీకర్ అనర్హత వేటు వేస్తే, ఫిరాయించిన ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దవుతుంది, దీంతో ఆ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరగవచ్చు. ఒకవేళ స్పీకర్ అనర్హత వేయకపోతే, బీఆర్ఎస్ మరోసారి న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉంది. స్పీకర్ నిర్ణయం రాజకీయ ఒత్తిళ్లకు లోనవుతుందన్న ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి.

**చట్టం ఏం చెబుతోంది?**

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, 1985 (10వ షెడ్యూల్) ప్రకారం, ఒక ఎమ్మెల్యే లేదా ఎంపీ తమ పార్టీ సభ్యత్వానికి స్వచ్ఛందంగా రాజీనామా చేస్తే, పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా ఓటు వేస్తే, లేదా స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి ఏదైనా పార్టీలో చేరితే అనర్హత వర్తిస్తుంది. అయితే, ఒక పార్టీలోని మొత్తం సభ్యుల్లో రెండింతల మంది (2/3) ఒకేసారి ఫిరాయిస్తే ఈ చట్టం వర్తించదు. ఈ కేసులో, 10 మంది ఎమ్మెల్యేలు విడివిడిగా కాంగ్రెస్‌లో చేరినందున, 2/3 నిబంధన వర్తించే అవకాశం లేదు. ఫిరాయింపు ఆధారాలను బీఆర్ఎస్ సమర్పించినట్లు తెలుస్తోంది, కానీ ఈ ఆధారాల బలం, వాటిని స్పీకర్ ఎలా పరిగణనలోకి తీసుకుంటారన్నది కీలకం.

**ఉప ఎన్నికల అవకాశం**

ఒకవేళ స్పీకర్ అనర్హత వేటు వేస్తే, 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవు. ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే, ఇటువంటి ఎన్నికలు రాజకీయ పార్టీలకు కీలక పరీక్షగా మారుతాయి. బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఇప్పటికే ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అయితే, కాంగ్రెస్ నేతలు ఈ ఫిరాయింపులు చట్టబద్ధమని, అనర్హత వేటు విషయంలో స్పీకర్ తమకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటారని ధీమాగా ఉన్నారు. ఉప ఎన్నికలు వస్తే, ప్రస్తుత రాజకీయ సమీకరణాల్లో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం ఉన్నప్పటికీ, బీఆర్ఎస్, బీజేపీలు గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది.

**రాజకీయ ప్రభావం**

ఈ తీర్పు తెలంగాణ రాజకీయాలపై గణనీయమైన ప్రభావం చూపనుంది. ఒకవైపు, బీఆర్ఎస్ ఈ విషయంలో నైతిక ఉన్నతిని ప్రదర్శిస్తూ, ఫిరాయింపులను ప్రజల్లో చర్చనీయాంశంగా మార్చే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు, కాంగ్రెస్ ఈ ఫిరాయింపులను సమర్థిస్తూ, తమ అధికార బలాన్ని పెంచుకునే వ్యూహంలో ఉంది. బీజేపీ ఈ వివాదంపై నిశ్శబ్దంగా ఉన్నప్పటికీ, ఉప ఎన్నికలు వస్తే తమ బలాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధంగా ఉంది. సామాజిక మాధ్యమాల్లో ఈ అంశంపై తీవ్ర చర్చ జరుగుతోంది. కొందరు ఫిరాయింపులను నీతి విరుద్ధమని ఖండిస్తుండగా, మరికొందరు రాజకీయ స్వేచ్ఛలో భాగంగా సమర్థిస్తున్నారు.

**స్పీకర్ నిర్ణయంపై ఉత్కంఠ**

సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. స్పీకర్ నిర్ణయం, అనర్హత వేటు, ఉప ఎన్నికల అవకాశం ఈ అంశాలన్నీ రాష్ట్ర రాజకీయ భవిష్యత్తును గణనీయంగా ప్రభావితం చేయనున్నాయి. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం అమలులోని లోపాలను ఈ వివాదం మరోసారి బయటపెట్టింది. రాజకీయ నీతి, చట్టపరమైన బాధ్యతలు, ప్రజాస్వామ్య విలువల మధ్య సమతుల్యత సాధించే దిశగా ఈ తీర్పు ఒక అడుగు వేసినట్లు కనిపిస్తోంది. రాబోయే మూడు నెలలు రాష్ట్ర రాజకీయాలకు కీలక సమయంగా మారనున్నాయి.



# వైటీపీఎస్ మొదటి యూనిట్ జాతికి అంకితం నేడు

**జనం పవర్, హైదరాబాద్ :**

యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం (వైటీపీఎస్) లోని 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌ను శుక్రవారం ప్రభుత్వం జాతికి అంకితం చేయనుంది. దీంతోపాటు రూ.950 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ పనులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా దామరచర్లలోని వైటీపీఎస్‌లో అధికారులు ఏర్పాట్లు చేశారు. గత ప్రభుత్వం 2015లో 800 మెగావాట్ల సామర్థ్యం గల 5 కేంద్రాల నిర్మాణం చేపట్టింది. 2017లో పనులు ప్రారంభించారు. సుమారు రూ.30వేల కోట్ల అంచనా వ్యయం కాగా మరో రూ.5వేల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండో యూనిట్‌ను గతేడాది డిసెంబరు 7న సీఎం ప్రారంభించారు. ఇప్పుడు ఒకటో యూనిట్‌ను జాతికి అంకితం చేసి పవర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేయనున్నారు. 3, 4వ యూనిట్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానున్నాయి. 5వ యూనిట్ 2026 మార్చిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్లాంటుకు మూడు కిలోమీటర్ల సమీపంలో దుబ్బతండా వద్ద ఉద్యోగుల నివాస సముదాయాల కోసం సుమారు 60 ఎకరాల్లో మెగా టౌన్‌షిప్ నిర్మించనున్నారు. మరోవైపు పవర్‌ప్లాంటు నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి జెన్‌కో ఉద్యోగాలు ఇవ్వలేదు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో ఇళ్లు కోల్పోయిన 112 మందికి మూడు నెలల క్రితం ఉద్యోగాలు ఇవ్వగా, మిగతా 540 మంది తమకు అవకాశం కల్పించాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వారి సమస్యలపై మంత్రులు సమీక్ష చేయనున్నారు.

# రైతులకు సకాలంలో ఎరువులు అందించాలి

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**జనం పవర్, సుల్తానాబాద్ ఆగస్టు 1:** సుల్తానాబాద్ మండలం చిన్న కల్వల గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు, ఎంపియూపిఎస్, ప్యాక్స్ ఎరువుల గోడౌన్, నారాయణపూర్ గ్రామంలోని ఎంపిపిఎస్, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, సుల్తానాబాద్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, తహసిల్దార్ కార్యాలయాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. నారాయణపూర్ గ్రామంలోని పాఠశాలల వద్ద శిథిలావస్థలో ఉన్న భవనాల తొలగింపుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సుల్తానాబాద్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి రాబోయే ఐదేళ్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. సుల్తానాబాద్ మండలంలో 526 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని, 94 ఇండ్లు బేస్మెంట్ వరకు పూర్తయ్యాయని అన్నారు. చిన్న కల్వల గ్రామంలో మంజూరైన 15 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం ప్రారంభించేందుకు అవసరమైతే మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణాలు అందించాలని కలెక్టర్ తెలిపారు. ఎరువుల గోడౌన్‌లో స్టాక్ పరిశీలించిన కలెక్టర్ రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని, ఎవరైనా రైతులు పాస్బుక్ తీసుకురాకుండా వస్తే వారిని తిరిగి పంపవద్దని వారు ఎక్కడ సాగు చేస్తున్నారు తెలుసుకొని కావాల్సిన ఎరువులు సరఫరా చేయాలని అధి కారులను ఆదేశించారు. సుల్తానాబాద్ ఆసు పత్రిలో నెలకు 29 ప్రసవాలు జరుగుతున్నాయని తెలుసు కున్న కలెక్టర్ అవసరమైన అదనపు సిబ్బంది,స్కాన్ మిషన్ మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం సుల్తానాబాద్ తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతిలో వచ్చిన ఆన్లైన్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, తహసిల్దార్ బషీరుద్దిన్, మండల పంచాయతీ అధికారి సమీర్ రెడ్డి, సుల్తానాబాద్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, పంచాయ తీరాజ్ ఏఈ సచిన్, మండల విద్యాశాఖ అధికారి రాజయ్య, మండల వ్యవసాయ అధికారి నాగార్జున, నారాయణపూర్ పంచాయతీ కార్యదర్శి మంగారెడ్డి చిన్న కల్వల సింగిల్ విండో సీఈవో రమేష్ అధికారులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలి

**పెద్దపల్లి:** పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని చిన్న కల్వల గ్రామంలో మంజూరైన 15 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. లబ్ధిదారులు ఇండ్లు నిర్మించేందుకు అవసరమైతే మహిళా సంఘాల ద్వారా రూ. 1 లక్ష రుణం అందించాల్సిందిగా సూచించారు. కలెక్టర్ సుల్తానాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి, ఫార్మసీ, ఔట పేషెంట్, జనరల్, పిల్లల, గర్భిణీ మహిళల వార్డులను పరిశీలించారు.

ఆసుపత్రిలో నెలకు 29 ప్రసవాలు జరు గుతున్నాయని గుర్తించి,అదనపు సిబ్బంది, స్కాన్‌మిషన్ మంజూరు చేయనున్నట్టు వెల్లడించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, తహసిల్దార్ బషీరుద్దిన్, మం డల పంచాయతీ అధికారి సమీర్ రెడ్డి, ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ రమాదేవి అధికారులు పాల్గొన్నారు.

# సాగు సజావుగా సాగేనా..?

## ఆకాశం వైపు అన్నదాత చూపులు



**జనం పవర్, మంథని, ఆగస్టు 1:** మండలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. చెదురు మదురు వానలు తప్ప భారీ వర్షాలు కురియక పోవడంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదు. వర్షాలు కురుస్తాయన్న కార్తి చూస్తూ ఉండగానే వెళ్లిపోయింది. సాగుకు అన్నీ సిద్ధం చేసుకున్న రైతుల్లో ఏమీ పాలుపోని పరిస్థితి ఎదురయింది. మంథని సబ్ డివిజన్‌లో 20 వేల ఎకరాల్లో వరి పండిస్తారు. కానీ వానలు వెనక పట్టు పట్టడంతో నార్లు ముదిరిపోతున్నాయి. బోర్ల కింద నాట్లు వేసిన రైతులకు భూగర్భ జలాలు అడుగంటి అగచాట్లు తప్పడం లేదు. దీని కంతటికి కారణం వాతావరణంలో వచ్చిన మార్పులు కారణంగా కనిపిస్తున్నాయి. వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతు ఆందోళన చెందుతున్నాడు. కాలం కలిసి వస్తుందని ఆశపడ్డ రైతులకు నిరాశ ఎదురవుతున్నది. రాబోవు కార్తుల్లోనైనా వర్షాలు సమృద్ధిగా పడతాయని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలో వర్షాల పరిస్థితి ఇలాగే ఉంటే ఇప్పటికే బోర్ల కింద నాట్లు వేసుకున్న వారి పరిస్థితి ఏమిటి అనేది ప్రశ్నార్థకంగా మారింది. కొన్ని జిల్లాల్లో కుండపోత వర్షాలు కురియగా పెద్దపల్లి జిల్లాలో మాత్రం ఆశించిన స్థాయిలో వర్షాలు అసలే కురవలేదు. వర్షాలు లేక నాకు రూపొందుకోకపోవడంతో రైతు కూలీలకు సరైన పని లేకుండా పోయింది.

# ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



**జనం పవర్, జగిత్యాల, ఆగస్టు 1:** జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు కీ శే. జలపతి రెడ్డి సతీమణితో పాటు ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు కవిత. శ్రీలత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ భూమి పూజలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి పాల్గొన్నారు. జీవన్ రెడ్డి గారు మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్లు నిర్వహణ చేపట్టే విధంగా రాష్ట్రంలో నాలుగు లక్షల ఇండ్ల నిర్మాణం ఈ సంవత్సరం చేప్పట్టబడడం హర్షించదగ్గ విషయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేషన్ కార్డు లేని ఎవరు అయిన గాని అర్హత ప్రాతిపదికన మంజూరు చేయడం జరిగిందన్నారు. సన్న బియ్యం పంపిణీ కానీ నిరుపేద వర్గాలకు గృహ అవసరాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం మహిళలకు ఉచిత రవాణా 500 రూపాయలకే గ్యాస్ పంపిణీ దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు ఏవైనా అర్హత కలిగిన వారందరికీ కల్పించాలని లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు పోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ స్థలాలు కాపాడుకోవడంతో పాటు పర్యావరణాన్నీ కాపాడు కోవడం కూడా మనపై బాధ్యత ఉన్నదన్నారు. వారి వెంట. కాంగ్రెస్ పార్టీ మండల మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందన్న, జున్ను రాజేందర్, శ్రీ రాముల గంగాధర్, కాంగ్రెస్ నాయకులు శీలం సురేందర్, మంగలారపు మైపాల్ , మాజీ ఎంపీపీ మహేష్ , కేతిరెడ్డి సత్తిరెడ్డి , గంట మన్మోహన్, వంశీ, శంకర్, మల్లరెడ్డి , తిరుపతి రావు లవంగా లచ్చాం తదితర నాయకులు పాల్గొన్నారు.

# డీజేఎఫ్ మహాసభను విజయవంతం చేయండి




**జనం పవర్, మంథని, ఆగస్టు 1:** వర్కింగ్ జర్నలిస్టుల హక్కుల సాధనకు నిజాయితీగా అంకితభావంతో పనిచేస్తున్న ఏకైక యూనియన్ డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (డిజెఎఫ్) అని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గడిపల్లి అజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం డీజేఎఫ్ 5వ మహాసభల గోడ పత్రికలు రెవెన్యూ డివిజనల్ అధికారి సురేష్, తహసీల్దార్ కుమారస్వామి ఆవిష్కరించారు. డిజెఎఫ్ ఐదవ మహాసభకు అడిగిన వెంటనే ముఖ్యఅతిథిగా హాజరయ్యేందుకు అంగీకరించిన ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతపల్లి విజయ రామారావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# తల్లి పాల ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రచారం చేయాలి

## అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే




**జనం పవర్,కరీంనగర్, ఆగస్టు 1:** తల్లిపాల వారోత్సవాలలో భాగంగా వాటి ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రచారం చేయాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల నిర్వహణ సమన్వయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ ఐసిడిఎస్, ఆరోగ్యశాఖ సమన్వయంతో అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆరోగ్య పోషన్ అభియాన్ సిబ్బంది తల్లిపాల ప్రాధాన్యతను వివరించాలని అన్నారు. వారోత్సవాల్లో భాగంగా ముర్రుపాల ప్రాధాన్యత వివరించాలని అన్నారు. వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, మెప్మా పీడీ వేణుమాధవ్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, సిడబ్ల్యుసి చైర్ పర్సన్ ధనలక్ష్మి, డిసిపిఓ పర్వీన్ అధికారులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలి

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**జనం పవర్, తిమ్మాపూర్, ఆగస్టు 1:** గర్భిణీలు, బాలింతలు అంగన్వాడీ సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. శుక్రవారం తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. అంగన్వాడి కేంద్రంలో పోషణ ఆరోగ్య దినం సందర్భంగా మూడు సంవత్సరాల లోపు పిల్లలకు బాలామృతం, గుడ్లు పంపిణీ చేశారు. ప్రీ స్కూల్ పిల్లలతో మమేకమై వారితో ముచ్చటించారు. ప్రీస్కూల్ కార్య క్రమాలను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రానికి హాజరై న బాలింతలు, గర్భిణీలతో మాట్లాడుతూ అంగన్వాడి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఇక్కడ ఇస్తు న్న పోషకాహారాన్ని స్వీకరించాలని, పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు.

అంగన్వాడీ కేంద్ర పరిధిలో నిర్వ హిస్తున్న శుక్రవారం సభకు హాజరై మహి ళలకు అంద జేస్తున్న సేవలను గురించి తెలుసుకోవాలని తెలిపారు. సిలబస్ ప్రకారం ప్రీస్కూల్ కార్యక్రమాలు నిర్వ హించా లని అంగన్వాడీ సిబ్బందిని ఆదేశించారు.

### ప్రాథమికోన్నత పాఠశాల సందర్శన...

నుస్తులాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. పలు తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులను నేలపై కూర్చోబెట్టడం పట్ల ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను బెంచీలపై లేదా మ్యాట్లపై కూర్చోబెట్టాలని సూచించారు. సిలబస్ ప్రకారం విద్యను బోధించాలని, తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థుల ప్రగతి నివేదికను తెలియ జేయాలని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, సిడిపిఓ శ్రీమతి, ఎంఈఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# 3న సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు



**జనం పవర్, గోదావరిఖని ఆగస్టు 1:** గోదావరిఖనిలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో ఈనెల 3వ తేదీ ఆదివారం, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలురు, బాలికల సాఫ్ట్ బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి భాష బోయిన వాసు తెలిపారు. పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు అదేరోజు ఉదయం 9 గంటలకు హాజరు కావలసిందిగా సూచించారు. ఈ పోటీలకు 01-01-2013 నుండి 31-12-2015 మధ్య జన్మించిన బాలబాలికలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఎంపికయ్యే క్రీడాకారులు ఆగస్టు 9 నుండి 11వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు 'సిద్ధార్థ' విద్యార్థి ఎంపిక



**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 1:** భగత్ నగర్‌లోని సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం సాయిచైతన్య ఈనెల మూడు నాలుగు తేదీలలో హనుమకొండ జవహర్లాల్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. 14 ఏళ్లలోపు బాలురవి భాగంలో నిర్వహించే పోటీలలో చైతన్య పాల్గొంటారు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ స్థానిక ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీలలో పాల్గొన్న చైతన్య మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి విద్యార్థిని అభినందించారు.

# బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించిన సుడా చైర్మన్



**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 1:** ముకరంపుర లోని బీసీ బాలుర వసతి గృహాన్ని శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శుక్రవారం సందర్శిం చారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా తెలుసుకున్నారు. బాలురతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని వార్డెన్‌కు సూచించారు. మధ్యాహ్నం మెనూలో ఇవ్వాల్సిన కొన్ని ఆహార పదార్థాలను సాయంత్రం ఇస్తున్నామని వార్డెన్ పేర్కొనగా, మెనూ ప్రకారం ఇవ్వాల్సిందేనని నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో మెస్ ఛార్జీలు పెంచిందని తెలిపారు.

# పాత ఎమ్మార్వో కార్యాలయం కూల్చివేత




**జనం పవర్, కమాన్ పూర్ ఆగస్టు1:** కమాన్‌పూర్ మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న పాత ఎంఆర్ఓ కార్యాలయ భవనాన్ని ఎమ్మార్వో వాసంతి ఆధ్వర్యంలో కూల్చివేత పనులు ప్రారంభించారు. కొన్ని సంవత్సరాలుగా ప్రైవేట్ భవనంలో అద్దెకు కొనసాగుతున్నఎమ్మార్వో కార్యాలయానికి శాశ్వత భవన నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ రూ. 50లక్షలు నిధులు కేటాయించారు. దీంతో పాత భవనాన్ని కూల్చి, అదే స్థలంలో కొత్త కార్యాలయ భవన నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

# దోమల నివారణ చర్యలు చేపట్టాలని కమిషనర్‌కు వినతి



**జనం పవర్, గోదావరిఖని టౌన్, ఆగస్టు 1:** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో స్థానిక విటల్ నగర్ 13, 44 డివిజన్లో దోమల బెడద చాలా ఉంది ఈ దోమకాటు ద్వారా డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ వంటి ప్రాణాంతక విష జ్వరాలు విజృంభిస్తున్నాయి ముఖ్యంగా చిన్నపిల్లలకి ఈ దోమ కాటు వలన అనారోగ్య పాలవుతున్నారు అని, డివిజన్లో ఫాగింగ్ స్ప్రే చేపిస్తే బాగుంటుందన్నారు. రామగుండం మున్సిపల్ కమిషనర్‌కి కటుకు ప్రవీణ్, ఇరుగురాల కళ్యాణ్ వినతిపత్రం అందించారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



**జనం పవర్, మంథని, ఆగస్టు 1:** మంథని మండలంలోని అడవి సోమన్‌పల్లి గ్రామ పంచాయతీ తనిఖీలో భాగంగా మంథని డివిజనల్ పంచాయతీ అధికారి కొమ్మెర సతీష్‌కుమార్ పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఎటువంటి నిర్మాణ పనులు చేయరాదని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. వర్షాకాల దృష్ట్యా సీషనల్ వ్యాదుల ప్రబలకుండా పారిశుధ్య పనులను నిరంతరం సక్రమంగా చేయవలెనని గ్రామ పంచాయతీ మల్టిపర్పస్ సిబ్బందిని ఆదేశించారు. వీరి వెంట ఎంపీడీవో టి. శేషయ్య సూరి,పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీ మల్టిపర్పస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నారీశక్తితో బాధ్యత పెరిగింది



**జనం పవర్, భైంసా, ఆగస్టు 1:** 'నిర్మల్ పోలీస్.. మీ పోలీస్' కార్యక్రమంలో భాగంగా నిర్మల ఎస్పీ జానకి షర్మిల ప్రారంభించిన నారిశక్తి కార్యక్రమం అద్భుతమైన ఫలితాన్నిస్తుందని మహిళా కానిస్టేబుల్ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో కార్యక్రమం అమలుపై మహిళా పోలీస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మహిళా పోలీసులు తన అనుభవాలను పంచుకున్నారు. ప్రజలకు మెరుగైన శాంతి భద్రతలను అందించేందుకు మేము ముందుంటామని ఎస్పీ జానిక షర్మిల గారిని మహిళా పోలీసులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా తమపై బాధ్యతలు పెరిగినయని పాల్గొన్నారు. నారిశక్తి కార్యక్రమం తమ మానసిక ధైర్యాన్ని పెంచిందని మహిళ కానిస్టేబుల్ పేర్కొన్నారు. ఎస్పీ మహిళా కానిస్టేబుల్ ల ముఖాముఖి ప్రోగ్రాం ఏర్పాటుచేసిన సందర్భంగా.. జిల్లాలోని నారిశక్తి, పోలీస్ అక్క కార్యక్రమాల వారిపై అభిప్రాయాలు,అనుభవాలు ఒకరికొకరు పంచుకొని వారి ఆనందాన్ని వ్యక్తపరిచారు. మహిళలు అన్నిట్లో సమానమని, ప్రజలకు మరింత సేవ చేసి ముందుకు రావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జానికి షర్మిల, జిల్లాలోని నారిశక్తి మహిళా కానిస్టేబులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల పంపిణీ



**జనం పవర్, భైంసా, ఆగస్టు 1:** ముధోల్ మండలంలోని తరోడ, ముధోల్ ,ఆష్ట గ్రామాల్లో సంబంధించిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఆయాగ్రామల పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి కార్యదర్శులు, డీలర్లు, రాజకీయ నాయకులు, లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ రేషన్ బియ్యం అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. కొత్త కార్డులు వచ్చినవారు గ్రామపంచాయతీ కార్యాలయంలో వాటిని తీసుకోవాలని తెలియజేశారు.

# ప్రజల పక్షాన నిరంతర పోరాటం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవి కుమార్
- పార్టీ విస్తృతస్థాయి సమావేశం



**జనం పవర్, జన్నారం, ఆగస్టు 1:** ప్రజల పక్షాన ఉండి నిరంతర పోరాటాలు చేసేది సిపిఎం పార్టీనేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవి కుమార్ అన్నారు. శుక్రవారం జన్నారం లోని జ్యోతి గార్డెన్స్ లో నిర్వహించిన సిపిఎం మంచి ర్యాల జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని, ప్రభుత్వాలు ఇచ్చిన హామీల పైన ప్రజల పక్షాన నిలబడి పోరాటాలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిపిఎం చేసే ఆందోళనా, పోరాటాలకు ప్రజల మద్దతుతో పాటు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. చేతినిండా పని కల్పించడం, కనీస వేతనాలు అమలు, ధరలు నియంత్రణ, వరద సాయం అందించడంలో, ఇళ్ల స్థలాలు మంజూరు, ఇండ్లు, ఉద్యోగ భద్రత కల్పన, తదితర అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదివాసులు, గిరిజనుల ఉనికిని ప్రశ్నార్థకం చేసే విధంగా జీవోలను జారీ చేస్తుందని మండిపడ్డారు. సిపిఎం ప్రజల పక్షాన ఉంటుందని తెలిపారు. అనంతరం పలు అంశాలపై జిల్లా కమిటీ సభ్యులు చర్చించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు ఆశయ్య, మంచిర్యాల జిల్లా కార్యదర్శి సంకె రవి, మండల కార్యదర్శి కనికరపు అశోక్, ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పోతు విజయశంకర్, సీపీఎం నాయకులు బుచ్చయ్య, లింగన్న, అంబటి లక్ష్మణ్, దాసండ్ల రాజన్న, పలు ప్రాంతాల నుండి వచ్చిన సిపిఎం నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

## ఎంఈవోకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి

# ప్రశంసల జల్లు

**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 1:** ఇటు ప్రధానోపాధ్యాయుడిగా, అటు కొత్తగూడెం మండలం ఎంఈవోగా బాధ్యత లు నిర్వర్తిస్తున్న డాక్టర్ ప్రభుదయాల్ పనితీరును రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ యోగితరాణా ప్రశంసిస్తూ లేఖ రాశా రు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు హెడ్మాస్టర్‌గా ఉన్న ప్రభు దయాల్ విద్యాభివృద్ధికి నిరంతర శ్రమించడమే కాకుండా విద్యార్థుల సంక్షేమం కొరకు తన సొంత ఖర్చులతో సహాయ సహకారాలు అందిస్తుంటారు. అలాగే మండల విద్యాశాఖ అధికారిగా తన పరిధిలో ఉన్న వివిధ ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ అక్కడ పనిచేసే ఉపాధ్యాయులకు ప్రభుత్వ విద్య గురించి పలు సూచనలు అందిస్తుంటారు. అంతేకాకుండా ప్రభుత్వం తరఫున విద్యార్థులకు అందుతున్న అన్ని వసతులు సక్రమంగా అందుతున్నాయా లేదా కూడా గమనించాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయులకు సూచిస్తుంటారు. ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్



Dr. Yogita Rana, I.A.S.
Secretary Education
Government of Telangana

31st July, 2025

Dear Dr. Prabhu Dayal garu,

I wish to extend my heartfelt **appreciation and congratulations** for your commitment and deep sense of responsibility towards improving school education in Bhadradri Kothagudem Mandal.

Thank you for the material you have shared with me. I did go through the same and happy to note your sincerity and commitment for the Department and most importantly towards the Children who are our primary responsibility. The materials you kindly shared with me reflect not only your academic insight, but also your **genuine concern for children, your proactive mindset, and your unwavering belief in the transformative power of education.**

It is truly inspiring to see a Teacher like you, who shoulders administrative responsibilities as Mandal Educational Officer, continue to prioritize the learning needs of children with such sincerity and passion. Your ability to combine leadership with classroom-level understanding makes your contribution especially meaningful.

A HM like you brings immense value to the Department, not just through your work, but through the spirit of service and excellence you embody. Your initiative, compassion, and drive to make a difference are deeply appreciated.

On behalf of the Education Department, I convey my **sincere thanks and warm congratulations.** We are fortunate to have Head Master/ MEO like you as part of our mission to ensure quality education for every child.

Best wishes.

Yours Sincerely
Yogita 31/7/25
(Dr. Yogita Rana)

Office: Room No. 1F-07, Dr. B.R. Ambedkar Telangana Secretariat, Hyderabad - 500 022.
Tele : +91 040 23454287, 23454297 ♦ E-mail: prlsecyedu@telangana.gov.in

యోగితరాణా ఉమ్మడి ఖమ్మం జిల్లాలను ఆకస్మికంగా సందర్శించి పలు పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలల పనితీరుపై మూడు గంటల రివ్యూ నిర్వహించారు. ఈ క్రమంలో కొత్తగూడెం ఎంఈవో డాక్టర్ ప్రభుదయాల్



పనితీరును తెలుసుకున్నారు. గతంలో ప్రభుదయాల్ గతంలో భద్రాచలం గిరిజన బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి కళాశాల పేరును జాతీయ ఉపాధ్యాయ మండలి న్యూఢిల్లీ స్థాయిలో ఉంచారు. తదుపరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మేదరబస్తీ పాఠశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారు. రామవరం హైస్కూలునకు బదిలీ కాక ముందు మధిర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ప్రతి ఏటా ఒక ట్రిపుల్ ఐటి బాసర సీటు, ప్రతి సంవత్సరం 10వ తరగతిలో అత్యుత్తమ ఫలితాలను సాధించి రికార్డు సృష్టించారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిచే గుర్తింపబడ్డ ప్రభుదయాల్‌ను పలువురు ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ఉపాధ్యాయులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రశంసించారు.

## తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం

### అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**జనం పవర్, భైంసా, ఆగస్టు 1:** బిడ్డ పుట్టిన గంటలోపే పాలిచ్చేలా తల్లికి సాయం చేయాలన్నది వార్షికోత్సవ ఉద్దేశమని నిర్మల్ అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. శుక్రవారం భైంసా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తల్లిపాల వార్షికోత్సవాలను ప్రారంభించారు. ప్రకృతి సిద్ధంగా లభించే పాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయన్నారు. తల్లిపాలలో వివిధ రకాల పోషకాలు ఉంటాయని, అవి శిశు పెరుగుదలకు దోహద పడతాయన్నారు. వారోత్సవాలు ఘనంగా నిర్వహించా లని ఐసిడిఎస్ అధికారులకు సూచించారు. తధానంతరం ఆసుపత్రిలో వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని అడిషనల్ కలెక్టర్ వైద్యులకు సూచిం చారు. పలు రికార్డులను పరిశీలించారు. వివిధ వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు నిర్వహించి వెంటనే రిపోర్టులను అందించాలని అన్నారు. వైద్యులు సమయపాలన పాటించి, రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. లేనియెడల చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ డాక్టర్ రాజేందర్, డిప్యూటీ డిఎంహెచ్ఓ ఆకాష్, ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ కాశీనాథ్, చిన్నపిల్లల నిపుణులు డాక్టర్ అనిల్ కుమార్, సివిల్ సర్జన్ డాక్టర్ పద్మావతి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాసర పీహెచ్‌సీ నిర్మాణానికి శంకుస్థాపన



**జనం పవర్, భైంసా, ఆగస్టు 1:** బాసర మండల కేంద్రంలో రూ. 16 లక్షలతో ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడనికి ఉప కేంద్రాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వైద్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లకుండా మన దగ్గరలోని అందుబాటులో ఉండడం కోసమే దీని ఉద్దేశ్యమని స్థానిక ప్రజలకు మరింత వేగవంతమైన మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పీఎస్సి నిర్మాణన్నీ చేపట్టినట్టు తెలిపారు. ప్రజలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రజలకు కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు బిజెపి నాయకులు,మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## ఘనంగా అన్న బహు సాటె జయంతి



**జనం పవర్, భైంసా, ఆగస్టు 1:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న సాహిత్య సామ్రాట్ అన్నా బహు సాటె 105వ జయంతి దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్, సాహిత్య సామ్రాట్ అన్న బహు సాటె చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అణగారిన వర్గాలను చైతన్యానికి సాటె చేసిన కృషిని అందరూ స్మరించుకున్నారు. మరాఠీ రచయితగా ఎన్నో నవలలు, కథలు, పాటలు, నాటకాలు రాశారని, అతని రచనలు సామాజిక సమస్యలను మరియు దళితుల జీవితాలను ప్రతిబింబిస్తాయని తెలిపారు. సామాజిక అసమానతలు, అణిచివేతకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ఈ సమావేశంలో భలే రావు శంకర్, శ్రీనివాస్, పోశెట్టి పాల్గొన్నారు.

## సూర్యాపూర్ చెరువు తూముకు గండి

**జనం పవర్, భైంసా, ఆగస్టు 1:** కుంటల మండలంలోని సూర్యాపూర్ చెరువు నిండి తూముకు గండి ఏర్పడింది. దీంతో చెరువులో నిలువ ఉన్న నీరంతా తూము ద్వారా వృథాగా పోతోంది. ఇటీవల చెరువు మరమ్మత్తులకు రూ. 10 లక్షలు



మంజూరు కాగా, అధికారుల నిర్లక్ష్యం మూలంగా నామమాత్రపు మరమ్మతులు చేశారని శివారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టు కింద ఉన్న పంటలు ఎలా పండుతాయనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువు కింద 450 ఎకరాల భూమి సాగవుతుంది. అధికారులు స్పందించి చెరువు గండిని పూడ్చి మరమ్మతు చేయాలని రైతులు విన్నవిస్తున్నారు.

# కొత్తపల్లి రైలు పట్టాలెక్కేదెన్నడో?

- దశాబ్ద కాలంలో 76 కిలోమీటర్లు మాత్రమే పూర్తి
- మిగిలిన మరో 75 కిలోమీటర్ల నిర్మాణం
- మరో 96 హెక్టర్ల భూసేకరణ
- రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లింపులలో జాప్యం




**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు, 1**

కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే మార్గం కోసం జిల్లా వాసులకు మరి కొన్నేళ్లపాటు ఎదురుచూపులు తప్పేలా లేవు. నిర్దేశించుకున్న లక్ష్యాల ప్రకారం ప్రస్తుత సంవత్సరం మార్చి నాటికే ఈ రైల్వే లైన్ పనులు పూర్తి కావాల్సి ఉండగా, పనుల్లో మరింత జాప్యం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తం 150 కిలోమీటర్ల నిడివిగల ఈ రైల్వే మార్గం నిర్మాణ పనులు 2016లో ప్రారంభం కాగా, ఇప్పటివరకు 76 కిలోమీటర్ల మేరకు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 75 కిలోమీటర్ల పనులు ఇంకా పూర్తి కావాల్సి ఉంది. సగం వరకు జరిగిన పనులకే దశాబ్ద కాలం పట్టడంతో, మిగిలిన మరో సగం పనులకు మరెంతకాలం తీసుకుంటుందో అనే సందేహాలు పట్టిపీడిస్తున్నాయి. సకాలంలో భూసేకరణ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంలో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లింపుల పైనే రైల్వే ప్రాజెక్టు పూర్తి కావడం ఆధారపడి ఉంటుందని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శుక్రవారం లోకసభ వేదికగా వెల్లడించారు.

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే..**

కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చినప్పటికీ అధిక ఖర్చు, నిర్వహణ సామర్థ్యం ఉండదన్న కారణంగా ఈ ప్రాజెక్టును పక్కన పెట్టారు. తిరిగి రాష్ట్ర ప్రభుత్వం వినతితో 2016లో కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వే ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. ఈ రైల్వే మార్గం కోసం 1145.6 హెక్టార్ల భూసేకరణ అవసరం కాగా, ఇప్పటివరకు 1049.5 హెక్టార్ల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించింది. మరో 96.1 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంది. ఇదే కాకుండా రైల్వే లైన్ నిర్మాణ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.926.93 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.416 కోట్లు మాత్రమే చెల్లించగలిగింది. మరో రూ.511.20 కోట్ల రూపాయల వాటా ధనాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే మార్గం రెండు ప్రత్యేకతలు కలిగి ఉంది. ఈ మార్గం అందుబాటులోకి వస్తే ఉత్తర, దక్షిణ భారతానికి ఇది ముఖద్వారంగా మారనుంది. ఇదే కాకుండా పలు పుణ్యక్షేత్రాల కారిడార్ గా గుర్తింపు తెచ్చుకోనుంది. కొమరవెల్లి మల్లికార్జున స్వామి, కొండపోచమ్మ, నాచారం లక్ష్మీనరసింహస్వామి, నాంపల్లి లక్ష్మీనరసింహస్వామి, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాల సందర్శనకు భక్తులకు ఈ మార్గం వీలు కల్పిస్తుంది. 2016లో ప్రారంభమైన ఈ రైల్వే మార్గంలో మనోహరాబాద్- సిద్దిపేట మధ్య 76 కిలోమీటర్ల పనులు పూర్తి కావడంతో, సిద్దిపేట నుండి మనోహరాబాద్ వరకు రైలు సర్వీసులు ప్రారంభం అయ్యాయి. సిద్దిపేట నుండి సిరిసిల్ల వరకు కల్వర్టులు, వంతెనలు, ఆర్ఓబి పనులు నత్తనడకన సాగుతున్నాయి. వాస్తవానికి ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే లక్ష్యాలను నిర్దేశించుకుని వేగవంతంగా పనులు చేపట్టినప్పటికీ, భూ సేకరణ, రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధుల చెల్లింపులో జరుగుతున్న జాప్యం ప్రతి బంధకాలుగా మారాయి. కరీంనగర్ జిల్లా కేంద్రాన్ని హైదరాబాద్ తో దగ్గరగా అనుసంధానించే ఈ రైల్వే మార్గంపై స్థానికులు పెట్టుకున్న ఆశలు నెరవేరాలంటే, మరికొన్నేళ్లు వేచి చూడక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి.

# అభివృద్ధి కోసం పోరాటం చేస్తాం

## సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల రవి




**జనం పవర్, వరంగల్ జిల్లా, ఆగస్టు 1:** వరంగల్ జిల్లా సమగ్ర అభివృద్ధికి సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల రవి తెలిపారు. శుక్రవారం శివనగర్ తమర భవన్‌లో సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల వరంగల్ జిల్లా వెనుకబడిందని ఆరోపించారు. ఇప్పటికైనా వరంగల్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల వరంగల్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన సీపీఐ జిల్లా మహాసభలో 316 మంది ప్రతినిధులు పాల్గొని జిల్లా సమగ్రాభివృద్ధి కోసం భవిష్యత్తులో చేయాల్సిన ఉద్యమాలపై సమగ్రంగా చర్చించి 17 తీర్మానాలు ఆమోదించినట్లు తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్టు పనులను వెంటనే ప్రారంభించాలని, కాజీపేటలోని కోచ్ ఫ్యాక్టరీ పనులను వేగవంతం చేయాలని, వరంగల్ నుంచి హైదరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని, కాంట్రాక్టు ఔటౌసోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇచ్చి , ఎరువులు, పురుగు మందులకు సబ్సిడీ ఇవ్వాలని, టెక్స్‌టైల్ పార్కులో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, విద్యా, వైద్యం ప్రైవేటీకరణను డిమాండ్ చేశారు. ఈ మహాసభలో 31 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నామని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శిగా షేక్ బాష్ మియా ఎన్నికైనట్లు తెలిపారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో, ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని వారికి పట్టాలు ఇచ్చి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని తీర్మానాలు చేశామన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరిన్ని పోరాటాలకు సీపీఐ సన్నద్ధమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు జాతీయ, రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ సమావేశంలో పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, బుస్స రవీందర్, గన్నారపు రమేష్, గుండె బద్రి, తాళ్లపల్లి రాయల తదితరులు పాల్గొన్నారు.

# చలో పెద్దపల్లి డీజేఎఫ్ వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన ఏసీపీ



**జనం పవర్, వరంగల్ జిల్లా, ఆగస్టు 1:** పెద్దపల్లిలో ఈ నెల 10న నిర్వహించనున్న డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (డీజేఎఫ్) ఐదో రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్‌ను ఏసీపీ ఎన్. వెంకటేష్ ఆవిష్కరించారు. వరంగల్ జిల్లా మామునూర్ ఈస్ట్ జోన్ ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం ఏసీపీ ఎన్.వెంకటేష్ రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డీజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోరుపాక రాజు, డీజేఎఫ్ వరంగల్ జిల్లా నాయకులు సిలువేరు శ్రీనివాస్, చుక్క సతీష్, రాజ్ కిరణ్ పాల్గొన్నారు.

# 'ఎన్నికల హామీలను మరిచిన ప్రభుత్వం'



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 1:** ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయిందని బీఆర్ఎస్వీ మండల నాయకుడు పరశురాములు గౌడ్ ఆరోపించారు. శుక్రవారం జిల్లాలోని నంగునూర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారి పార్టీ కార్యకర్తలకు నామినేట్ పదవులు ఇస్తాలేరన్నారు. దళితులంటే పడని సీఎం రేవంత్ రెడ్డికి బీసీలను కూడా మోసం చేస్తున్నారన్నారు. ఆయనకు ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఆయన తన పదవీని కాపాడుకునేందుకు ఢిల్లీకి వెళ్లేందుకే సమయం సరిపోతుందన్నారు. ఎన్నికల హామీ లను అమలు చేయకపోతే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళన వ్యక్తం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# చెంచల్ చెరువుపల్లిలో రేషన్ కార్డుల పంపిణీ



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 1:** కోహెడ మండలంలోని చెంచల్ చెరువుపల్లిలో శుక్రవారం లబ్ధిదారులను రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భీంరెడ్డి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో నూతన రేషన్ కార్డులు మంజూరు చేయకుండా ప్రజలను ఇబ్బందులు పెట్టిందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వంలో ఇచ్చిన మాట మేరకు రేషన్ కార్డులు ఇవ్వడమే సన్న బియ్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమ పాలన కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు తిమ్మాపురం సంపత్ కుమార్, మాజీ సర్పంచ్ భీంరెడ్డి మల్లారెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఆవుల మహేందర్, లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్టీఐ జిల్లా కో ఆర్డినేటర్‌గా మాలోతు వెంకట్



**జనం పవర్, వరంగల్ జిల్లా, ఆగస్టు 1:** తెలంగాణ ఆర్టీఐ ఫోరం (సమాచార హక్కు చట్టం) హనువకొండ జిల్లా కోఆర్డినేటర్‌గా మాలోతు వెంకట్ ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు. శుక్రవారం చిట్యాల విమల్ రాజు అధ్యక్షతన నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశంలో ఆయ నను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విమల్ రాజు మాట్లాడుతూ ప్రతి పౌరునికి పరిపాలన విభాగాలకు సంబంధించిన అన్ని విషయాలు క్షుణ్ణంగా తెలుసుకునేందుకు రూపొందించిన చట్టమే సమాచార హక్కు చట్టం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

# హరీష్ రావు కృషితోనే నియోజకవర్గం అభివృద్ధి చెందింది

### - బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మెరుగు మహేష్



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 1:** సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు కృషితోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మెరుగు మహేష్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణ పరిధిలోని ఒకటవ వార్డు లింగారెడ్డిపల్లిలో ఆయన మాజీ సర్పంచులు బొండ్ల రామస్వామి, గడ్డం లక్ష్మీ, మాజీ ఎంపీటీసీలు కదుర్ల బాలయ్య, బండి రంగయ్య, బండరుపల్లి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కదుర్ల హేమంత్, మాజీ పార్టీ అధ్యక్షులు పోతుల మహేష్, బోనాల ఉప్పలయ్య, వార్డు అధ్యక్షుడు రాయవేని ప్రశాంత్, మేర్గ మాధవ్, మోహన్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్సరాలు గడుస్తున్న నామమాత్రపు పనులతో పాలన కొనసాగిస్తూ మాజీ మంత్రి హరీష్ రావుపై విమర్శలు చేయడం విడ్డురంగా ఉందన్నారు. రెండు లక్షల రూపాయల విలువ గల ప్రొసీడింగులు తెచ్చిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ ఏ పదివిరీత్యా కొబ్బరి కాయలు కొడుతున్నారని ప్రశ్నించారు. ఆయన నియోజకవర్గంలో ప్రజలు తిరస్కరించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాత్రమేనన్నారు. హరీష్ రావు పల్లెలను, పట్టణాన్ని పట్టించుకోలేదని అబద్దాలు చెప్పడం తగదన్నారు. మళ్లీ ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు, తెలంగాణ ఉద్యమం గురించి కొట్లాడిన హరీష్ రావు ఉద్యమ స్ఫూర్తి హరికృష్ణకు తెలువదన్నారు. ఉద్యమం గురించి మాట్లాడే నైతికత లేదన్నారు.

ఈ సమావేశంలో పార్టీ నాయకులు మెరుగు కృష్ణవేణి, కెమ్మసారం శ్రీనివాస్, పోతుల నరేష్, తాటికొండ పర్శరాములు, బండి మధు, పోతుల మోహన్, కాగితం పర్శరాములు, కాశావేని కనకయ్య, పెర్క వినయ్, పెరక రాజయ్య పాల్గొన్నారు.

# బిల్డింగ్ కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి



**జనం పవర్, వరంగల్ జిల్లా, ఆగస్టు 1:** బిల్డింగ్ కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఎంసీపీఐయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంసీపీఐయూ పార్టీ కార్యాలయంలో బిల్లింగ్, అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ప్లీనరి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐసీటీయూ జాతీయ నాయకుడు నర్ర ప్రతాప్, ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి సుంచు జగదీశ్వర్, జిల్లా నాయకులు మాలోతు సాగర్, ముక్కెర రామస్వామి, ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకురావడంతో బిల్డింగ్ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజర్ కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమం కోసమే నిధులు ఖర్చు పెట్టాలన్నారు. బిల్డింగ్ కార్మికులకు కనీస పెన్షన్ సౌకర్యం తొమ్మిది వేల రూపాయలు అమలు చేయాలన్నారు. బిల్డింగ్ కార్మికులకు పని దొరకక పడిగాడ్పులు కాస్తూ ఉప్పుడు ఉపవాసం ఉంటూ దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని చేసే దగ్గర ప్రమాదవశాత్తు మరణించినా, గాయపడ్డా ఇంటి యజమాని, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. అధునాతనమైన యంత్రాలు రావడంతో బిల్డింగ్ కార్మికుల పని కోల్పోయే ప్రమాదం వచ్చిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల ఆంక్షలు విధిస్తూ యాజమానులు, పెట్టుబడుదాలకు అనుకూలంగా చట్టాలు చేయడం తగదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బిల్లింగ్, ఇతర కన్స్ట్రక్షన్ కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. అడ్డాల వద్ద టాయిలెట్ సౌకర్యాలను కల్పించాలన్నారు. ప్రతి బిల్లింగ్ కార్మికునికి ఖాళీ స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇల్లు కట్టివ్వాలని డిమాండ్ చేశారు. లేబర్ ఆఫీసులో చాలావరకు క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే వాటిని పరిష్కరించాలని కోరారు. అడ్డాలవారీగా హెల్త్ క్యాంప్‌లు నిర్వహించాలన్నారు.

ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఎండీ అక్బర్ ఖాన్, కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా కే సప్న, ఉపాధ్యక్షులుగా సాగర్, పెద్ది రాజు, గణిపాక ఓదెలు, సహాయ దర్శులుగా రవీందర్, యాకయ్య, రఘుపతి, సంపత్, రాజులతో కూడిన 22 మందితో జిల్లా కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రామస్వామి, రియాజ్, రాజు, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి

## ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య



**జనం పవర్ హనుమకొండ, ఆగస్టు 1:** అవినీతి నిర్మూలనలతో యువత, మేధావులు భాగస్వామ్యం కావాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య పిలుపునిచ్చారు. జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) గ్రేటర్ వరంగల్ ముఖ్య నాయకుల సమావేశం హనుమకొండ పట్టణంలో నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య ముఖ్య అతిథిగా హాజరై సంస్థ విధి విధా నాలను తెలిపారు. అవినీతి, అక్రమాలకు తావులేని సమాజం కోసం తమ సంస్థ చేస్తున్న కార్యక్రమాల్లో విద్యావంతులు, మేధావులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ చట్టాలకు అనుగుణంగా రాజీలేని పోరాటాలు చేస్తూ అవినీతి, అక్రమాలను సమాజంలో దోషులుగా చూపించడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. మంచిని పెంచడం మానవత్వాన్ని పంచడం వంటి కార్యక్రమాలు తమ సంస్థలో ప్రధాన అంశాలని చెప్పారు. రాష్ట్ర అధికార ప్రతినిధి, న్యాయవాది మాదాసు మొగిలయ్యతో కలిసి ఈ సందర్భంగా ఇటీవల రద్దు చేసిన గ్రేటర్ వరంగల్, హనుమకొండ, వరంగల్ జిల్లా నూతన కమిటీలను ప్రకటించారు.

రాష్ట్ర కమిటీ సభ్యులు ఉచత శ్రీకాంత్, ఇసంపెల్లి నగేష్, భానోత్ జవహర్‌లాల్ నెహ్రూ నాయక్, ఉమ్మడి వరంగల్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఆవునూరి కిషోర్, గ్రేటర్ వరంగల్ కమిటీగ్రేటర్ అధ్యక్షుడు కోమండ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గూడూరు నరేందర్, హనుమకొండ జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బండి సదానందం, ఉపాధ్యక్షుడు పడాల మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి పల్లెవేని మహేష్, వరంగల్ జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షుడు మేరుగు రాంబాబు, ఉపాధ్యక్షుడు గుజ్జ సురేందర్, ప్రధాన కార్యదర్శిసంగెం రమేష్, అధికార ప్రతినిధి నర్మేట యాదగిరి. తదితరులను నియమించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పాక శ్రీనివాస్, యాదవ్, రాష్ట్ర నాయకులు ఉమ్మడి జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లిలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్

**45 వాహనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు**



జనం పవర్, కొత్తపల్లి, ఆగస్టు 1: కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సరైన ధ్రువపత్రాలు లేని 45 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో 43 బైకులు, 2 ఆటోలు ఉన్నాయి. కార్డన్ సెర్చ్‌లో భాగంగా పాత నేరస్తులు ఎవరైనా ఈ ప్రాంతంలో అద్దెకు ఇల్లు తీసుకుని నివసిస్తున్నారా అని ఆరాతీశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు స్థానికులకు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా, షీటీం అంశాలపై అవగాహన కల్పించారు.

చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని కమిషనర్ గౌస్ ఆలం హెచ్చరించారు. శాంతి భద్రతలకు



విఘాతం కల్పించే వ్యక్తులపై సమాచారం అందించాలని ప్రజలను కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని డయల్ 100 ద్వారా, లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. షీటీం ఇన్స్పెక్టర్ శ్రీలత మాట్లాడుతూ, సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న మోసాల గురించి విద్యార్థినులకు వివరించారు. ముఖ్యంగా అమ్మాయిలు తమ ఫోటోలను ఎవరికీ పంపవద్దని, అలా పంపిన ఫోటోలను అడ్డంపెట్టుకొని బ్లాక్ మెయిల్ చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించారు. ఆకతాయిల వేధింపులకు గురైతే భయపడకుండా ధైర్యంగా షీ టీమ్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. షీ టీమ్‌లో ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగంపై జరుగుతున్న పోరాటంలో భాగస్వాములై, డ్రగ్ రహిత సమాజ నిర్మాణం కోసం పాటుపడతామని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు, విద్యార్థులు అధికారులు ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు నిరంజన్ రెడ్డి, శ్రీలత, పుల్లయ్య, ప్రదీప్ కుమార్‌లతో పాటు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దేశీ డిప్లొమా ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

జనం పవర్, పెద్దపల్లి, ఆగస్టు 1: ఎరువులు, క్రిమి సంహారక లైసెన్స్ కలిగిన కనీసం 10వ తరగతి విద్యార్హత గల డీలర్ల నుంచి దేశీ డిప్లొమా ప్రవేశానికి 80 దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పెద్దపల్లి జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ (వ్యవసాయ శాఖ) బి.శ్రీనివాస్ తెలిపారు. డీలర్లకు ఫీజు రూ.14,000లు, ఇతరులకు రూ.28,000లు. డిమాండ్ డ్రాఫ్ట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఆత్మ దేశీ పెద్దపల్లి పేరిట తీయాలని సూచించారు. కోర్సు ఆదివారం మరియు సెలవు రోజుల్లో 48 తరగతులు ఉంటాయన్నారు. పెద్దపెల్లి జిల్లాలో ఏకకాలంలో రెండు బ్యాచులను నిర్వహించడానికి రెండు సమన్వయకర్తల (ఫెసిలిటేటర్) పోస్టులకు కూడా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వ్యవసాయ డిగ్రీ లేదా పీజీతో 5 సంవత్సరాల అనుభవం ఉన్నవారు దరఖాస్తులను ప్రభుత్వ పనిదినాల్లో, రూమ్ నం. 220, జిల్లా సమీకృత కార్యాలయ భవనంలో 13.08.2025 సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాస్ తెలిపారు.

## విద్యార్థులకు టై, బెల్టుల బహూకరణ

జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 1: కరీంనగర్ రూరల్ మండలం ఎలబోతారంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు బీజేపీ నాయకుడు వేల్పుల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం బెల్టులు, టై,బ్యాడ్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సాగర్, గ్రామ కార్యదర్శి కిరణ్, సామాజిక కార్యకర్త కరివేద వేణుమాధవరెడ్డి, మల్లెతుల దేవేందర్, దారం జగన్నాథ రెడ్డి, ఏమిరెడ్డి మధుసూదనరెడ్డి, బొద్దుల వెంకటేశం, పంబాల లక్ష్మణ్, పుట్ట కొమురయ్య, పున్నం కిరణ్, ప్రసాద్, శ్రీకాంత్, సాయిపవన్ రెడ్డి, ప్రవీణ్, గుజ్జేటి రవి, సాగర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ యూత్ వింగ్ అధ్యక్షుడిగా శ్యామ్ సుందర్



జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 1: గాంధీ గ్లోబల్ ఫ్యామి లీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ యూత్ వింగ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా వి. శ్యాంసుందర్ రెడ్డి నియమితులయ్యారు. సంస్థ గౌరవ ప్రచారక చైర్మన్ మజీద్ ఖాన్ ఈ మేరకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ గాంధీ సిద్ధాంతాలను యువతకు చేరువ చేయడమే ప్రధాన లక్ష్యం అన్నారు. ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ, సంస్థ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## పెద్దమ్మ తల్లి ఆలయంలో కుంకుమ పూజలు

జనం పవర్, కరీంనగర్, ఆగస్ట్ 1: శ్రావణ మాస తొలి శుక్రవారం సందర్భంగా స్థానిక భగత్ నగర్‌లోని శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయంలో కుంకుమ పూజ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ, పుష్పాలతో అర్చనలు చేశారు. బీజేపీ నాయకులు, మాజీ మేయర్ వై.సునీల్ రావు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ దేవస్థాన కమిటీ సభ్యులు కొలకాని నర్సయ్య, పండుగ నాగరాజు, పిట్టల లింగయ్య, రాగిళ్ల లక్ష్మణ్, కంకటి శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్ నగర్‌లో 'ఆరోగ్య మహిళ'



జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 1: స్థానిక భగత్ నగర్‌లోని చైతన్య యూత్ క్లబ్ భవనంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్య మహిళ కార్యక్రమం నిర్వహించారు. మహిళల కోసం ఉద్దేశించిన ఈ ఉచిత వైద్య శిబిరాన్ని బీజేపీ నాయకుడు, మాజీ మేయర్ వై.సునీల్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలను పరిశీలించారు. వారికి పలు సూచనలు చేశారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, డివిజన్ మహిళలు చైతన్య యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన శ్రీమహాశక్తి దేవాలయం



- అమ్మవార్లకు ఒడి బియ్యం సమర్పించిన మహిళలు
- ఘనంగా కుంకుమ పూజలు

జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 1: శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా కరీం నగర్ చైతన్యపురిలోని శ్రీ మహాశక్తి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. మహిళలు పెద్ద సంఖ్య లో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించి, ఒడి బియ్యం సమర్పించారు. శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాలకు ఎంతో విశిష్టత ఉంది. శ్రీ మహాశక్తి దేవాలయంలోని అమ్మవార్లను పూజించడం వల్ల ఐశ్వర్యం, సౌభాగ్యం సిద్ధిస్తాయని మహిళలు ప్రగాఢంగా విశ్వ సిస్తుంటారు. దేవాలయంలోని ముగ్గురు శక్తివంతమైన అమ్మవార్లను పూజిస్తే తమ కుటుంబసభ్యులు సుఖ సంతోషాలతో ఉంటారని ఆలయానికి వచ్చే భక్తుల విశ్వాసం. సాయంత్రం దేవాలయంలో సామూహిక కుంకుమ పూజలు ఘనంగా జరి గాయి. మహిళలు లక్ష్మి దేవి పూజలో పాల్గొని, వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కాంట్రాక్టర్ల దోపిడీ

**ఆర్డీఓ ఎల్. జీవాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేసిన ముజాహిద్**



జనం పవర్, కోరుట్ల, ఆగస్టు 1: ఇందిరమ్మ ఇల్లు పథకం కింద కాంట్రాక్టర్లు ముడి సరుకుల ధరలు పెంచి పేద ప్రజలను అప్పుల భారం వైపు నెట్టుతున్నారని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ మహమ్మద్ ముజాహిద్ ఆర్డిఓ ఎల్.జీవాకర్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్, స్టీల్, ఇసుక తదితర మెటీరియల్ ధరలపై నియంత్రణ లేక పోవడం వల్ల బేస్‌మెంట్ స్థాయికే రూ.3 లక్షలు వ్యయమవుతోందని ముజాహిద్ తెలిపారు. పథకం ద్వారా కలలు నెరవేర్చుకోవాల్సిన పేదలు అప్పుల్లో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర సెక్రెటరీ, యునైటెడ్ ముస్లిం మైనార్టీ రైట్స్ ఆర్గనైజేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, సందార ముస్లిం తెగల సంఘం అడ్వైజర్ మహమ్మద్ ముజాహిద్ మాట్లాడుతూ ఈ దోపిడీపై అధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి సరుకుల ధరలపై నియంత్రణ విధించాలన్నారు. పేదలకు ఇల్లు కావాలి అప్పుల పాలు కాకూడదన్నారు. పథకాన్ని పేదలకు ఉపయోగపడే విధంగా అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ బారి, ఎంపీజే ఉపాధ్యక్షుడు మొహమ్మద్ నజీబుద్దీన్, యునైటెడ్ ముస్లిం మైనార్టీ రైట్స్ ఆర్గనైజేషన్ కోరుట్ల ప్రెసిడెంట్ మొహమ్మద్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# స్కూటీ ఎక్కి.. చెత్త సేకరించి..

**రామగుండం మాజీ కార్పొరేటర్ వినూత్న నిరసన**



జనం పవర్, గోదావరిఖని, ఆగస్టు 1: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని మాజీ కార్పొరేటర్ పారిశుధ్య కార్మికురాలి అవతారం ఎత్తారు. ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించి వినూత్నంగా నిరసన తెలియజేశారు. కార్పొరేషన్ అధికారులు, పారిశుద్య కార్మికుల పనితీరు పట్ల విసుగు చెందిన ఆమె తన డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్య తీవ్రతను అధికారుల దృష్టికి తెచ్చేందుకు, వారి కళ్ళు తెరిపించేందుకు తన స్కూటీకి ఇరువైపులా చెత్త డబ్బాలు తగిలించుకొని ఇంటింటికి తిరుగుతూ స్వయంగా చెత్త సేకరించారు.

రామగుండం కార్పొరేషన్ 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలత శుక్రవారం చేపట్టిన ఈ విన్నూత్న నిరసన కార్యక్రమం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. గత నెల రోజులుగా పారిశుద్య కార్మికులు విధులకు హాజరవడం లేదని, దీంతో రహదారులపై చెత్త కుప్పలుగా పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని సుమలత ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలు ప్రారంభమైనప్పటి నుంచి వీధులన్నీ చిత్తడిగా మారి, పాములు, విషపూరిత పురుగులు సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తి అధ్వానంగా తయారయిందని, ఫాగింగ్ చేపట్టక పోవడం వల్ల దోమలు పెరిగి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. డివిజన్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. అధికార పార్టీకి చెందిన నేతల డివిజన్లకే అధికారులు పూర్తి సహకారం అందిస్తున్నారని, మిగిలిన డివిజన్లలో కనీస అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపట్టడం లేదన్నారు. అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకునేందుకే బల్దియ సిబ్బంది పనిచేస్తున్నారే తప్ప ప్రజల సమస్యలపై వారికి చిత్తశుద్ధి లేదని ఆమె ఆరోపించారు. తమ డివిజన్‌ను చిన్నచూపు చూస్తున్న అధికారుల తీరుపై దశలవారీగా ప్రజలతో కలిసి నిరసనలు కొనసాగిస్తామని ఆమె హెచ్చరించారు.

## కాలుష్యం కోరల్లో పారిశ్రామిక ప్రాంతం

**పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సెక్రెటరీకి మద్దెల దినేష్ వినతిపత్రం**

జనం పవర్, మంథని, ఆగస్టు 1: రామగుండం, గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోయిందని పేర్కొంటూ మద్దెల దినేష్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రామగుండం గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో విపరీతంగా కాలుష్యం పెరిగిపోయిందని పేర్కొన్నారు. కాలుష్యం భారీ నుండి ఈ ప్రాంతాన్ని, ప్రజల ప్రాణాలను కాపాడాలని విన్నవించారు. కాలుష్య నియంత్రణపై ప్రధాన కూడళ్లలో ప్రజల అవగాహన కోసం సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను తక్షణం మూసివేయాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సెక్రెటరీ గుగ్లొత్ రవికి సమర్పించిన వినతిపత్రంలో మద్దెల దినేష్ కోరారు.

## శాంతినగర్‌లో తల్లిపాల వారోత్సవాలు



జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 1: ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి వారంలో తల్లి పాల వారోత్సవాలు, వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని సిడిపిఓ సబిత తెలిపారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ అర్బన్ మండలం శాంతినగర్ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సభ, తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీడీపీఓ సబిత మాట్లాడుతూ పుట్టిన గంట లోపు ముర్రు పాలు పట్టడం వలన కలిగే లాభాలు, సాధారణ ప్రసవాల ప్రాముఖ్యత గురించి వివరించారు. మహిళలు తమ సమస్యలను శుక్రవారం సభలో విన్నవించు కోవచ్చని సూచించారు. ప్రతి మహిళ, గర్భిణీ, బాలింత శుక్రవారం సభకు తప్పక హాజరు కావాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కార్యక్రమంలో జిల్లాలో మహిళలందరికీ సుమారు 50 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని, వీటిని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ పరీక్ష అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, సంపత్, మహేష్, స్వప్న, సతీష్, గర్భిణీలు, బాలింతలు కిశోర బాలికలు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## నేడు మంథని నియోజకవర్గంలో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన

జనం పవర్, మంథని, ఆగస్టు 1: ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శనివారం మంథని నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మల్హర్ రావు మండలం తాడిచెర్లలో పిఎసిఎస్ భవనం, గ్రంథాలయ భవనాన్ని, సీసీ రోడ్లను ప్రారంభించనున్నారు. తహసీల్ ఆఫీస్ కాంపౌండ్ వాల్ శంకుస్థాపన చేయనున్నారు. ఎగ్లాస్‌పూర్ జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో బాయ్స్ హాస్టల్ భవనానికి మంత్రి శంకుస్థాపన చేస్తారు. మంథని మున్సిపాలిటీలో మంథని పెట్రోల్ బంక్ ఏరియా, పెద్దపల్లి రోడ్డు, గోదావరిఖని రోడ్డు ప్రాంతాల్లో నెలకొల్పబడిన సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తారు. ఉసిగారేణి సిఎస్ఆర్ కింద పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపడే క్వూశ్చర్ కోర్స్ మెటీరియల్స్ ప్రభుత్వ కాలేజీ గ్రౌండ్‌లోని ప్రభుత్వ హైస్కూల్‌లో మంత్రి విద్యార్థులకు అందజేయనున్నారు, అటవీ శాఖ, మునిసిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారు. మంథని మండల పరిషత్ కార్యాలయం వద్ద నమూనా ఇందిరమ్మ ఇంటిని, మంథని మునిసిపాలిటీలో త్వరలో నిర్మించనున్న 410 ఇందిరమ్మ ఇండ్లకు పైలాన్ శంకుస్థాపన, మంథని మండలంలోని అడవి సోమనపల్లి, ఖానాపూర్, మల్లేపల్లి, ఆరెంద, గోపాల్‌పూర్, ఉప్పట్ల, తోటగోపయ్యపల్లి గ్రామ పంచాయతీ నూతన భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం వివిధ కార్యక్రమాల్లో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

# ఆర్జీ-1లో 104 శాతం బొగ్గు ఉత్పత్తి




జీఎం లలిత కుమార్

జనం పవర్, గోదావరిఖని, ఆగస్టు 1: ఆర్జీ-1 ఏరియాలో జూలై మాసంలో 104 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించడం జరిగిందని జీఎం లలిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై మాసం వరకు ఆర్జీ వన్ సాధించిన ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. ఆర్జీ వన్ ఏరియా జూలై మాసంలో 3 లక్షల 20 వేల 900 టన్నుల ఉత్పత్తికి గాను 3 లక్షల 33 వేల 925 టన్నులతో 104 శాతం ఉత్పత్తిని సాధించడం జరిగిందన్నారు. అలాగే వార్షిక లక్ష్యంలో జూలై మాసం వరకు 15 లక్షల 14 వేల టన్నులకు గాను 12 లక్షల 60 వేల 499 టన్నులతో 83 శాతం ఉత్పత్తి సాధించామని తెలిపారు. కేవలం ఉత్పత్తికే పరిమితం కాకుండా కార్మికులు, కార్మిక కుటుంబాల సంక్షేమం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని తెలిపారు. ప్రభావిత గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వెల్లడించారు.

ఈ సమావేశంలో ఆర్జీ వన్ ఎస్ఓటూ జీఎం ఆంజనేయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, శ్రావణ్ కుమార్, డిజిఎం, వర్క్ షాప్ జితేందర్ సింగ్, వీరారెడ్డి, ధనలక్ష్మి బాయ్, డివైపిఎం వేణు తదితరులు పాల్గొన్నారు.




# ఆ పాటకు ఓకే చెప్పడం కష్టమైన నిర్ణయం: ప్రియాంక చోప్రా

సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కిన 'రామ్-లీలా' అప్పట్లో ట్రెండ్ సృష్టించిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో 'రామ్ చాహే లీలా' అనే ప్రత్యేక పాటలో బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా ఆడి పాడారు. వైట్ డ్రెస్‌లో తన డ్యాన్స్‌తో యూత్‌లో జోష్ నింపారు. తాజాగా ఈ పాట జ్ఞాపకాలను ఆమె గుర్తుచేసుకున్నారు. దీన్ని ఓకే చెప్పడం ఆమె తీసుకున్న కఠినమైన నిర్ణయమని అన్నారు. ''సంజయ్ ఈ పాట కోసం నన్ను సంప్రదించినప్పుడు నేను చేయగలనా అనుకున్నాను. కష్టంగానే ఓకే చెప్పా. కానీ, దర్శకుడు నాకు ధైర్యాన్నిచ్చారు. హావభావాల దగ్గర నుంచి డ్యాన్స్ మూమెంట్స్ వరకూ ఆయన సలహాలిచ్చారు. పాటలోని ప్రతి పదం అర్థాన్ని వివరించారు. కొరియోగ్రాఫర్ అద్భుతంగా కంపోజ్ చేశారు. భోజన విరామ సమయంలోనూ నాకు డ్యాన్స్ మూమెంట్స్ గురించే వివరించేవారు. ఈ జ్ఞాపకాలన్నీ ఎప్పటికీ గుర్తుంటాయి'' అని ప్రియాంక రాసుకొచ్చారు. రొమాంటిక్ డ్రామాగా వచ్చిన రామ్-లీలాలో రణ్‌వీర్ - దీపికా ప్రధాన పాత్రల్లో నటించారు. 2013లో ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా అప్పట్లోనే రూ.200 కోట్లకు పైగా వసూలు చేసింది. గ్యాంగ్‌స్టర్ కుటుంబాలకు చెందిన ఇద్దరు ప్రేమికుల చుట్టూ దీని కథ తిరుగుతుంది. ఇక ఈ సినిమాకు సంజయ్‌లీలా భన్సాలీనే స్వరాలు అందించడం విశేషం.






# రామోజీ ఫిల్మ్‌సిటీలో 'పెద్ది' సందడి

కీలకమైన సన్నివేశాల చిత్రీకరణతో 'పెద్ది' సినిమా చకచకా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది. అందులో భాగంగా రామ్‌చరణ్‌తోపాటు, ఇతర తారాగణంపై ఓ వేడుక నేపథ్యంలో సాగే సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా సెట్‌ని తీర్చిదిద్దారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ చిత్రమిది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. రామ్‌చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఈ చిత్రం కోసం శారీరకంగా ప్రత్యేకంగా సన్నద్ధమయ్యారు రామ్‌చరణ్. వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో కన్నడ నటుడు శివరాజ్ కుమార్‌తోపాటు, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్నారు.







# విశాఖలో తొలి కూత

ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) నగారా మోగింది. పీకేఎల్ 12వ సీజన్‌కు విశాఖపట్నంలో తెరలేవనుంది. ఈనెల 29న వైజాగ్‌లో జరిగే తొలి మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్‌తో తమిళ తలైవాస్ తలపడనుంది. అదే రోజు బెంగళూరు బుల్స్‌ను పుణెరి పల్టాన్ ఢీకొట్టనుంది. విశాఖతో పాటు జైపూర్, చెన్నై, ఢిల్లీ వేదికలు పీకేఎల్-12కు ఆతిథ్యమివ్వనున్నాయి. సెప్టెంబరు 12న రెండో అంచె పోటీలు జైపూర్‌లో ప్రారంభమవుతాయి. సెప్టెంబరు 29న చెన్నైలో మూడో అంచె.. అక్టోబరు 13న ఢిల్లీలో చివరి దశ మ్యాచ్‌లు మొదలవుతాయి. ప్లేఆఫ్స్‌కు ముందు అభిమానులకు మరింత వినోదాన్ని అందించేందుకు చివరి దశలో ట్రిపుల్ హెడర్ (రోజుకు మూడు మ్యాచ్‌లు) నిర్వహించనున్నట్లు గురువారం పీకేఎల్ ప్రకటించింది. ''ఏడేళ్ల తర్వాత వైజాగ్‌కు పీకేఎల్ తిరిగి రావడం ఆనందంగా ఉంది. 2018లో ఆంధ్రప్రదేశ్ చివరి సారిగా ఆరో సీజన్ మ్యాచ్‌ల అనుభూతి పొందింది. అంతకుముందు 1, 3వ సీజన్‌లకు విశాఖ ఆతిథ్యమిచ్చింది. ప్రొ కబడ్డీ ఎదుగుదలలో 12వ సీజన్ కొత్త అధ్యాయంగా నిలుస్తుంది'' అని పీకేఎల్ కమిషనర్ అనుపమ్ గోస్వామి తెలిపాడు.

# కరుణ్ నుంచి 'క్రీడాస్ఫూర్తి' నేర్చుకోండి.. ఇంగ్లాండ్‌కు ఫ్యాన్స్ కౌంటర్

ఐదు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ స్పోర్టివ్ స్పిరిట్ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత బెటర్. ఏకంగా ఆ జట్టు సారథి బెన్‌స్టోక్స్ మాంచెస్టర్‌లో 'డ్రా'మాలు ఆడిన సంగతి తెలిసిందే. అంతకుముందు లార్డ్స్‌లోనూ భారత ప్లేయర్లపై పదేపదే స్లెడ్జింగ్‌కు పాల్పడ్డాడు. ఈక్రమంలో ఇంగ్లాండ్ జట్టే తలదించుకొనేలా టీమ్‌ఇండియా ఆటగాడు కరుణ్ నాయర్ వ్యవహరించిన తీరు అభిమానులను ఆకట్టుకుంది. క్రీడాస్ఫూర్తి అంటే ఇదీ అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ఇకనైనా కరుణ్‌ను చూసి నేర్చుకోండంటూ ఇంగ్లాండ్‌కు హితవు పలికారు. అసలేం జరిగిందంటే?

లండన్‌లోని ఓవల్ మైదానం వేదికగా ఇంగ్లాండ్ - భారత్ జట్ల మధ్య ఐదో టెస్టు జరుగుతోంది. టాస్ ఓడిన భారత్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి టీమ్‌ఇండియా 204/6 స్కోరుతో ఉంది. క్రీజ్‌లో కరుణ్ నాయర్ (52*), వాషింగ్టన్ సుందర్ (19*) ఉన్నారు. వీరిద్దరూ అప్పటికే హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నిర్మించారు. ఈ క్రమంలో ఓవర్టన్ వేసిన బంతిని కరుణ్ ఆడాడు. అది బౌండరీ లైన్ వద్దకు వెళ్తుండగా.. క్రిస్ వోక్స్ బంతిని ఆపాడు. ఈక్రమంలో అతడి భుజానికి బలమైన గాయమైంది. తీవ్ర నొప్పితో వెంటనే వైద్యసిబ్బందిని పిలిచాడు. అప్పటికే భారత బ్యాటర్లు మూడు పరుగులు పూర్తి చేసేశారు. నాలుగో పరుగు తీసే అవకాశం ఉన్నా సరే.. కరుణ్‌నాయర్ వద్దని సుందర్‌ను ఆపాడు. వోక్స్ గాయపడి ఇబ్బందిపడే క్రమంలో పరుగు తీసుకోవడం సరికాదనే ఉద్దేశంతో కరుణ్ ఇలా వ్యవహరించాడు. ఇదే భారత అభిమానులకు నచ్చింది. వెంటనే ఇంగ్లాండ్ ఆటగాళ్లను ఉద్దేశించి 'కరుణ్ నుంచి క్రీడాస్ఫూర్తి నేర్చుకోండి' అంటూ కామెంట్లు చేశారు.




## వోక్స్ కొనసాగడం కష్టమే..

ఇప్పటికే ఇంగ్లాండ్ జట్టుకు కెప్టెన్ స్టోక్స్ దూరమైన సంగతి తెలిసిందే. ఆర్చర్ కూడా బెంచ్‌కే పరిమితమైన క్రమంలో క్రిస్ వోక్స్ కీలక పాత్ర పోషిస్తాడని అనుకున్నారు. అందుకు తగినట్టుగానే కేఎల్ రాహుల్‌ను ఔట్ చేసి కీలక వికెట్ అందించాడు. అయితే, ఇప్పుడు గాయపడటంతో ఇంగ్లాండ్‌కు పెద్ద షాకే. అతడు ఈ టెస్టులో కొనసాగడం కష్టమేనన్న సంకేతాలు అక్కడి నుంచి వస్తున్నాయి. గస్ అట్కిన్సన్ కూడా దీనిపై స్పష్టత ఇవ్వలేదు. మళ్లీ మైదానంలోకి వస్తే ఆ విషయం పెద్ద ఆశ్చర్యమే అవుతుందని వ్యాఖ్యానించాడు.

PRINTED PUBLISHED,OWNED BY G.THIRUPATHI,PRINTED AT SRK PRINTERS (V)KOKKERAKUNTA (M)RAMADUGU (D)KARIMNAGAR 505001.TELANGANA, PUBLISHED FROM H.NO 10-6-219, KISAN NAGAR,KARIMNAGAR 505001,TELANGANA.RNI NO TEL **TEL/2016/69862**, EDITOR:BANDARI MARUTHI.

# యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను సందర్శించిన మంత్రులు

- నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని పూర్తిస్థాయిలో ప్రారంభిస్తాం
- ఘన స్వాగతం పలికిన స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**జనం పవర్, మిర్యాలగూడ, ఆగస్టు 1:** మిర్యాలగూడ నియోజకవర్గంలోని దామచర్ల మండలం వీర్లపాలెం సమీపంలోనీ యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ను శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ ,ఉత్తమ్ కుమార్ రెడ్డి,కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో కలిసి ప్లాంట్లో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టౌన్ షిప్ పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం యూనిట్ - 1 ను కమర్షియల్ ఆపరేషన్ డిక్లరేషన్ (సి ఓ డి) చేసిన మంత్రుల బృందం.వన మహోత్సవంలో భాగంగా ప్లాంట్ లో మొక్కలు నాటి మంత్రులు అనంత ప్లాంట్ పనుల పురోగతిపై జెన్కో,బీహెచ్ఈఎల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో భూ నిర్వాసితుల సమస్యలను ఆలకించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్లాంట్లో పనిచేసే వారందరికీ వసతి కల్పించేందుకు గృహ నిర్మాణ కార్యక్రమానికి శంకుస్థాపన చేసాం.ఇప్పటి ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం ప్రజా ప్రభుత్వం అని భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఆర్ ఓ ఎఫ్ బాధితులకు ఉద్యోగాలు ఇవ్వాలని దృఢ నిర్ణయాన్ని తీసుకున్నాము అని అన్నారు.అందులో భాగంగా ఇప్పటికే 114 మందికి ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది.అలాగే స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి విన్నపం మేరకు 246, ఆర్ఓఎఫ్ఆర్ కింద 113 లో కలిపి వాటిని కూడా ఆగస్టు 15 వరకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.యాదాద్రి పవర్ ప్లాంట్ తో పాటు పులిచింతల భూ నిర్వాసితులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని మా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని ప్రజలందరి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఈ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంనీ అన్నారు.ప్రజాధనం వృధా కాకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత సమయానికి పవర్ ప్లాంట్ పూర్తయ్యేలా వెంటపడి మరి పనులు చేపిస్తున్నాం.గత ప్రభుత్వం ప్లాంట్ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేయడంతో ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయి.ప్రభుత్వంపై అధిక భారమైనప్పటికీ తమ ప్రజా ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ తీసుకొని ప్రాజెక్టు పనులు వేగవంతం చేశాం.రెండవసారి కూడా ప్రజా అభిప్రాయ సేకరణ నిర్వహించి ఎలాంటి అడ్డంకులు లేకుండా చేయటంలో సఫలీకృతం అయ్యాం.ఇప్పటికే రెండో యూనిట్ ఉత్పత్తి ప్రారంభం కాగా మొదటి యూనిట్ ను నేడు ప్రారంభించాము.మిగిలిన మూడు యూనిట్లను వేగవంతంగా పూర్తి చేసి వచ్చే జనవరి 26 నాటికి 4000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి పూర్తిస్థాయిలో ప్రారంభిస్తాం అన్నారు.ఉద్యోగుల, సిబ్బంది కొరకు అన్ని సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ టౌన్షిప్ ఏర్పాటు శంకుస్థాపన చేసాం.అత్యంత ఉన్నత ప్రమాణాలతో విద్య వైద్యం అందించేందుకు పాఠశాల, వైద్యశాల నిర్మిస్తున్నాం.వైటిపిఎస్ ఉద్యోగులు సిబ్బందితోపాటు సమీప ప్రాంత ప్రజలకు విద్య, వైద్యం అందిస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మెటల్ సిఎండి హరీష్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# శేషజీవితాన్ని సమాజసేవకు అంకితం చేయాలి

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**




**జనం పవన్, వనపర్తి, ఆగస్టు 1:** కళా సాహితీ వేదిక అధ్యక్షులు, ప్రధానోపాధ్యాయులు పలుస.శంకర్ గౌడ్ పదవీ విరమణ వీడ్కోలు సభ వనపర్తి జిల్లా కేంద్రంలో శుక్రవారం శ్రీ లక్ష్మీ కృష్ణ గార్డెన్ నందు ఉపాధ్యాయులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, పత్రికా ప్రతినిధులతో ఘనంగా జరిగింది.ఈ సమావేశానికి మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి, మాజీ ఎం.పి,మాజీ ఎమ్మెల్యే రావుల.చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై పలుస.శైలజా శంకర్ గౌడ్ దంపతులను ఘనంగా సన్మానించారు.ఈ సమావేశానికి బైరోజు.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు.మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ శంకర్ గౌడ్ తన అంకితభావంతో పనిచేసి ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చినారు అని రిటైర్మెంట్ తర్వాత తన శేషజీవితాన్ని కాదు తన అనుభవంతో సమాజ సేవకు విశేషమైన జీవితాన్ని ఉపయోగించాలని సూచించారు. శంకర్ గౌడ్ రిటైర్మెంట్ గురువారం జరిగింది. శుక్రవారం తన పుట్టినరోజు కావడం యాదృచ్ఛికం అయినా సమాజములో శంకర్ గౌడ్ నూతన పాత్ర పోషించటానికి నాంది కావాలని ఆకాంక్షించారు.సాహితీ కళావేదిక ప్రారంభించి ఎందరో కళాకారులను,సంస్కృతి సాంప్రదాయాలను సమాజానికి తెలియజేసినారని వారి మున్ముందు చేయబోయే కార్యక్రమాలకు తమ సహకారం ఉంటుందని మరోసారి వారికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలకు చేరాలంటే గురువుల బోధన,ఆశీర్వాదం ముఖ్యమని అటువంటి ఉపాధ్యాయ వృత్తిని నిర్వర్తించిన శంకర్ గౌడ్ ధన్యజీవి అని కొనియాడారు.శంకర్ గౌడ్ వృతి ఉపాధ్యాయుడు అయిన ప్రవృతి రీత్యా ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు, సమాజ సేవలు చేశారని వారు స్థాపించిన కళా సాహితీ వేదిక భవిష్యత్తు తరాలకు మార్గదర్శనమైంది అని అన్నారు. వనపర్తి సంస్థానం విద్యకు,సాగునీరు,తాగు నీరుకు పాలకులు పెట్టింది పేరని అటువంటి మన వనపర్తిని పాలకులు ఎవరైనా బ్రాండ్ ఇమేజ్ కాపాడాలని సూచించారు.ఈ కార్యక్రమములో గట్టు యాదవ్, వామను గౌడ్,వాకిటి శ్రీధర్, పలుస. రమేష్ గౌడ్,నందిమల్ల. అశోక్, ఉపాద్యాయులు రవిప్రసాద్, కంటే.ఆంజనేయులు, వరప్రసాద్,జన జ్వాల. రాధాకృష్ణ,రాజారాం ప్రకాష్, షేక్. జహంగీర్, బండారు. కృష్ణ, ఉంగ్లం. తిరుమల్, నాగన్న యాదవ్,ఆవుల.రమేష్,యుగంధర్ రెడ్డి,చిట్యాల.రాము తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ




**జనం పవర్, మందమర్రి, ఆగస్టు 1:** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని దీపక్‌నగర్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్ తనిఖీ చేసి అక్కడి వైద్యులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మానస, డాక్టర్ జాన్వి, సురేఖ మోహన్, బుక్క వెంకటేశ్వర్లు, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటసాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య శాఖ అధికారి మాట్లాడుతూ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు వారి ఆధీనంలో ఉన్న ఉపకేంద్రములతో వైద్యులు ,ఆరోగ్య కార్యకర్తలు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అదేవిధంగా ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో ఎంఎల్ఓస్ సమయపాలన పాటిస్తూ . అందుబాటులో ఉండాలని, ప్రభావిత ప్రాంతాలలో మున్సిపల్ వార్డులలో వ్యాధులు ప్రబలకుండా అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అదేవిధంగా వైద్యాధికారులు మందమర్రి మున్సిపల్ కమిషనర్ ఇతర అధికారులతో సమన్వయం చేసుకుంటూ కీటకజనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ ,చికెన్ గునియా లాంటి రోగాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అదేవిధంగా ..వైద్య సిబ్బంది ఈ వర్షాకాలం సీజన్లో వ్యాధులు ప్రబలకుండా.. ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు, ఈరోజు నుండి ఏడు రోజుల పాటు బ్రెస్ట్ ఫీడింగ్ వారోత్సవాల సందర్భంగా.. తల్లులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు .అదేవిధంగా.. అర్బన్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి ,వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు, పాఠశాలలో వంట చేసేవారు వంటగదిని, వంట సామాగ్రిని, వంట రూములను పర్యవేక్షణ చేసి తగు సూచనలు ,అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించినారు .నెల రోజుల గర్భవతులు ..ఈటీడీలు నమోదు చేసుకుని ,వారి వివరములను భద్రపరిచి, రోజువారిగా సమీక్ష చేసుకోవాలి అదేవిధంగా వాటిని అనుసరిస్తూ.. ఉండాలన్నారు .అసంక్రమణ వ్యాధులు సంక్రమించే ఆస్కారమున్న 30 సంవత్సరములు పైబడిన వారందరికీ తప్పనిసరి పరీక్షలు చేయడము ,వాటి వివరములను ఆన్లైన్లో నమోదు చేయడము ,మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించినారు. అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో.. అందిస్తున్న అవగాహన కార్యక్రమాలు, ఐఇసి ఆక్టివిటీస్ పైన సంతృప్తి వ్యక్తపరిచారు.

## రెస్టారెంట్లపై ఫుడ్‌సేఫ్టీ టాస్క్ ఫోర్స్ దాడులు




**జనం పవర్, రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 1:** జిల్లాలోని పలు రెస్టారెంట్లలో రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు శుక్రవారం ఆకస్మికదాడులు చేశారు. టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఫుడ్ ఇన్స్పెక్టర్స్ రోహిత్ రెడ్డి, శ్రీషిక, పి.స్వాతి, అంకిత్ రెడ్డిలతో కూడిన బృందం వేములవాడ మండల కేంద్రంలోగల తాజ్ ఫ్యామిలీ రెస్టారెంట్, జిల్లా కేంద్రలోని రుచి హొటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేయగా, పూర్తిగా అపరిశుభ్ర వాతావరణంలో భోజనం తయారు చేయడం, కిటికీలకు మెష్ లేకపోవడం, పెస్ట్ కంట్రోల్ పాటించకపోవడం, అపరిశుభ్రంగా ఉన్న రిఫ్రిజిరేటర్లలో నిలువ చేసిన దుర్వాసనతో కూడిన మాంసపు ఉత్పత్తులను భారీ మొత్తంలో గుర్తించడం, అలాగే ఎగ్జాస్ట్ ఫాన్స్ దుమ్ము ధూళితో పేరుకుపోవడం, ఫుడ్ హ్యాండ్లర్స్ హెయిర్ క్యాప్, హ్యాండ్ గ్లోవ్స్ ధరించకపోవడం, అపరిశుభ్ర ప్రాంతంలో మూతలు తీసిన దుమ్ము ధూళి ఈగలతో కూడిన ఆహార పదార్థాలు, కుళ్లిపోయిన ఉడికిన గుడ్లు, హానికర రసాయనాలతో కూడిన కృత్రిమ రంగులను బిర్యానీ, ఇతర ఆహార తయారీకి ఉపయోగించడం వంటివి గుర్తించారు.ెంస్టారెంట్ నందు రూ.20,500 విలువ గల సుమారు 70 కిలోల నిల్వ ఉంచిన మాంసం, కాలం చెల్లిన టీ పౌడర్, ఇతర ముడి సరుకులు, లేబుల్ డిఫెన్స్ కలిగిన కాజు, మసాలా పొడులు, మిగిలి ఉంచిన బిర్యాని, ఇతర ఆహార పదార్థాలను ప్రజల ఆరోగ్య నిమిత్తం హొటల్ యాజమాన్యాన్ని ఫుడ్ సేఫ్టీ టాస్ఫోర్స్ హెడ్ వి.జ్యోతిర్మయి హెచ్చరించి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఎఫ్ఎస్ఎస్ 2006 చట్టం ఉల్లంఘించినందుకు గాను వారికి నోటీసులు జారీ చేశారు. హొటల్స్‌లో పూర్తిగా అపరిశుభ్ర వాతావరణ ఉన్నందున ఎఫ్ఎస్ఎస్ చట్టం 2006 మున్సిపల్ చట్టం 2019 ని ఉల్లంఘించినందుకు గాను వేములవాడ, సిరిసిల్ల మున్సిపల్ అధికారులచే రూ.30 వేల జరిమానా విధించి రెస్టారెంట్‌ను తదుపరి రెక్టిఫికేషన్ చర్యల నిమిత్తం తాత్కాలికంగా మూసి వేశారు. హొటల్ యాజమాన్యం కలిగి ఉండాల్సిన రికార్డ్స్ మెయింటైన్ చేయకపోవడంతో ఫుడ్ సేఫ్టీటాస్క్ ఫోర్స్ బృందం 2006 ఉల్లంఘించినందుకు గాను, నోటీసులు జారీ చేశారు. అనుమానిత ఆహార పదార్థాల శాంపుళ్లను సేకరించి పరీక్ష నిమిత్తం హైదరాబాద్‌లో గల ల్యాబ్‌కు పంపించారు. నిబంధనలు పాటించని, ప్రభుత్వ అనుమతులు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వ్యాపారాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర టాస్క్ ఫోర్స్ టీం హెడ్ వి.జ్యోతిర్మయి తెలిపారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## హస్తకళ ప్రదర్శనను ప్రారంభించిన కలెక్టర్




**జనం పవర్, బైంసా, ఆగస్టు 1:** నిర్మల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్లో హస్తకళ ప్రదర్శన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రారంభించారు. నీతి ఆయోగ్ ఆకాంక్ష హాట్ కార్యక్రమంలో భాగంగా ఐదు రోజుల పాటు ఈ ప్రదర్శన నిర్వహించ నున్నట్లు కలెక్టర్ తెలిపారు. మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారుచేసిన హస్తకళల ఉత్పత్తులను ఆమె పరిశీలించారు. వేదికపై మహిళ శక్తి సభ్యులు ఒక్కొక్కరుగా మాట్లాడి మరి అనుభవాలను పంచుకున్నారు. అందులో భాగంగా ఓ మహిళ తన బిడ్డను ఎత్తుకొని మాట్లాడుతుండగా ఆ పాప ఏడవడం గమనించిన కలెక్టర్ ఆ చిన్నారిని ఎత్తుకొని ఆడించారు. కలెక్టర్ మెలిగిన తీరుపై అంతట ప్రశంసలు నిల్లువేత్తుతున్నాయి. మహిళా సంఘాలకు అన్ని రకాల సపోర్ట్ గా తెలంగాణ ప్రభుత్వం ఉంటుందన్నారు. కలెక్టర్‌తో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, నీతి అయోగ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సన్మానం




**జనం పవర్, బైంసా, ఆగస్టు 1:** ప్రజల కోసం అహర్నిశలు కృషిచేసి గౌరవప్రదంగా పదవీ విరమణ పొందడం అదృష్టమని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల గారు అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఎస్సై భాస్కర్ రావు, హెడ్ కానిస్టేబుల్ గోపాలకృష్ణలను నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి జ్ఞాపకను అందించి, వారు చేసిన సేవలు కొనియాడారు. గత 41 సంవత్సరాలు పోలీస్ శాఖలో ఎంతో సేవ చేశారని, వారి సేవలు ఎంతో స్ఫూర్తి వంతంగా నిలుస్తాయన్నారు. ఈ సమావేశంలో నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల తోపాటు పదవి విరమణ పొందిన కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సర్దుబాటులో పైరవీలు?

**జనం పవర్, రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 1:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 221 మంది విద్యార్థులకు సాంఘికశాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయురాలిని శుక్రవారం వర్క్ అడ్జస్ట్మెంట్‌లో భాగంగా జిల్లా విద్యాశాఖ, అనంతగిరి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాని విచిత్రం ఏంటంటే అదే మండలంలోని గాలిపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 150 మంది విద్యార్థులకు సోషల్ బోధిస్తున్న రెండు సోషల్ పోస్టుల్లో ఒకరైన జూనియర్ ఉపాధ్యాయుడు,కందికట్కూర్ జెడ్పీహెచ్ ఎస్ పాఠశాలలో కూడా 88 మంది విద్యార్థులకు సోషల్ బోధిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరు జూనియర్ ఉన్నారు. ఈ ఇద్దరు ఉపాధ్యాయులు ఇల్లంతకుంట జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలి కంటే జూనియర్స్ అయినప్పటిక కూడా వారిని బదిలీ చేయకుండా, సీనియర్ ఉపాధ్యాయురాలును బదిలీ చేయ టం వెనుక జిల్లా విద్యాశాఖలో పైరవీలు ఏ విధంగా జరుగుతున్నాయో అర్థం అవుతుంది. వర్క్ అడ్జస్ట్మెంట్ లో సీనియర్స్‌ను వదిలి జూనియర్స్‌ను మాత్రమే బదిలీ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ కూడా అవేమి పట్టకుండా బదిలీ చేయటం నిబంధనలకు విరుద్ధమని అంటున్నారు. ఇంకా ముఖ్య విషయం ఏమిటంటే ఇల్లంతకుంట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 221 మంది విద్యార్థులు మండలంలో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న స్కూల్ అయినప్పటికీ కూడా ఇక్కడి నుంచి బదిలీ చేయటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే కలెక్టర్ స్పందించి తప్పుడు బదిలీలను నిలిపివేసి, న్యాయపరంగా సీనియర్స్, జూనియర్స్‌ను పరిగణలోకి తీసుకుంటూ బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి..

## మద్యం దుకాణాలను ఆలోచన విరమించుకోవాలి

**జనం పవర్, బెల్లంపల్లి, ఆగస్ట్ 1:** మద్యం దుకాణాల పెంపు ఆలోచనను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐఎఫ్డిడబ్ల్యు (అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య) మంచిర్యాల జిల్లా కార్యదర్శి దుర్గం లక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలోని ఎంసిపిఐ(యు) పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ,ఇటీవల రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న మద్యం దుకాణాల పెంపు నిర్ణయాలతో గ్రామాల్లో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనందని, ఒకవైపు మద్యం ఉచ్చులో పడి యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటుంటే వారి భవిష్యత్తును మరింత అంధకారంగా చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకున్నటువంటి మద్యం దుకాణాల పెంపు నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సింగరేణి మెడికల్ బోర్డు అవినీతిలో కూరుకుపోయింది

**హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్**




**జనం పవర్, మందమర్రి, ఆగస్టు 1:** సింగరేణి మెడికల్ బోర్డు పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రి సింగరేణి ఏరియా సందర్శనకు వచ్చిన ఆయన మాట్లాడుతూ, అంతకుముందు కొంతమందిని మెడికల్ బోర్డులో అన్‌ఫిట్ చేయకుండా హయ్యర్ రిఫరెన్స్ పేరుతో 9 నుంచి 10 నెలలుగా పెండింగులో పెట్టి, అటు జీతం లేకుండా చేసి, తీవ్ర ఆర్థిక నష్టానికి గురిచేసి, అప్పుల పాలు చేసిన సింగరేణి యాజమాన్యం. గత నెల 30, 31 తేదీలలో నిర్వహించిన, మెడికల్ బోర్డు 55 మందికి గాను, ఓకే ఒక్కరు బోర్డుకు హాజరు కాలేదు, హాజరైన 54 మంది నుండి కేవలం ఐదుగురిని మాత్రమే అన్‌ఫిట్ చేస్తూ, మిగతా వాళ్లను కొందరిని ఎవరి డ్యూటీలకు వాళ్లు వెళ్లాలని ఇంకొందరిని సర్ఫేస్ ఉద్యోగాలు కల్పిస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ చర్యల వల్ల పది నెలల నుండి ఎలాంటి వేతనాలు లేకుండా అనేక ఆశలతో ఉద్యోగం వస్తుందని భావించిన కుటుంబాలకు నిరాశ మిగిలిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు తిప్పారపు సారయ్య, సెంట్రల్ ఉపాధ్యక్షులు పార్వతి రాజిరెడ్డి, కార్యదర్శి ఎర్ర శ్రీనివాసరెడ్డి, మందమర్రి ఉపాధ్యక్షులు జే .శ్రీనివాస్ పాల్గొన్నారు.



తమ పశువుల పాకను అధికారులు అక్రమంగా కూల్చివేశారని ఆరోపిస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలోకి గెదేలను తోలుకువచ్చి నిరసన తెలిపిన ఘటన శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగింది. కే ఓదెలు, లలిత దంపతులు సింగరేణి ఆసుపత్రి వద్ద తమ సొంత ఇంటిలో గెదేల కోసం రేకుల షెడ్డు నిర్మించుకున్నారు. దీనిని అధికారులు కూల్చివేయడంతో వారి బంధువు జి రమేష్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలోకి గెదేలను తీసుకువచ్చి నిరసన తెలిపారు. - భూపాలపల్లి

## క్రీడల ద్వారానే చెడు వ్యసనాలకు చెక్

### ఎస్పీ అశోక్ కుమార్

**జనం పవర్, జగిత్యాల, ఆగస్టు 1:** జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యువతకు మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుంది. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల పై యువతకు అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ మెగా వాలీబాల్ టోర్నమెంట్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి బెలూన్లను గాల్లోకి వదిలి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా పోలీసులకు యువతకు సత్సంబంధాలు మెరుగుపరచాలని జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్ను ప్రారంభించడం జరిగిందన్నారు. గడిచిన కొన్ని రోజులుగా పోలీస్ స్టేషన్, సర్కిల్ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు ఈరోజు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించేందుకు అవగాహన పెంచే ఉద్దేశ్యంతో, జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో యువతను సరైన మార్గంలో ఉంచాలనే లక్ష్యంతో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిం చామని అన్నారు. జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి తన వంతు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో ఎస్బి డిఎస్పీ వెంకటరమణ, సైబర్ క్రైమ్ డిఎస్పీ వెంకటరమణ, జగిత్యాల,మెట్పల్లి డిఎస్పీలు రఘు చందర్. రాములు, రిజర్వ్ ఇన్స్పెక్టర్‌లు కిరణ్ కుమార్. వేణు, సైదులు, డిసీఆర్బి, ఎస్బి, సీసీఎస్. ఇన్ స్పెక్టర్లు శ్రీనివాస్, ఆరిఫ్ అలీఖాన్, శ్రీనివాస్. సి.ఐ అనిల్ కుమార్. సుధాకర్, కరుణాకర్. రామ్ నరసింహా రెడ్డి, సురేష్‌లు. ఎస్ఐలు పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

## 'ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యకు కృషి చేయాలి'

**జనం పవర్, పెద్దపల్లి, ఆగస్టు 1:** రామగుండం ఉపాధ్యాయులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచా లంటే ఉపాధ్యాయులు నాణ్యమైన బోధనకే ప్రాధాన్యంఇవ్వాలన్నారు. విద్యార్థులు ఏ.ఐ ల్యాబ్‌లలో ప్రతిరోజూ 20 నిమిషాలు పాల్గొనేలాషెడ్యూల్ రూపొందించాలని, ఏ.ఐ టూల్స్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థుల కంప్రహెన్షన్ స్కిల్స్ పెరిగితే అన్ని విషయాలపై అవగాహన మెరుగవుతుందని తెలిపారు. ప్రతి పాఠశాలలో 30 శాతం విద్యార్థులు చురుగ్గా ఉన్నప్పటికీ మిగిలిన వారికీ కనీస ప్రమాణాలు అందేలా శ్రద్ధ పెట్టాలని కోరారు. ఎఫ్ఆర్ఎస్ విధానం ఉపాధ్యాయుల పనిభారాన్ని తగ్గిస్తుందని, యూఐడిసిలో పాఠశాలల పూర్తి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. అభి వృద్ధి పనులు మూడు నెలల్లో పూర్తి చేస్తా మని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి డి.మాధవి, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎస్టీఎఫ్ఐ జెండా ఆవిష్కరణ

**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 1:** ఎస్టీఎఫ్ఐ (అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల ఫెడరేషన్)జెండాను శుక్రవారం టిఎస్ యుటిఎఫ్ కార్యాలయంలో సీనియర్ యుటిఎఫ్ నాయకులు ఆర్.రామన్ గౌడు ఎగర వేశారు. ఈనెల 6న కలకత్తాలో జరిగే ఎస్టిఎఫ్ఐ తొమ్మిదవ వార్షిక సమావేశాలు విజయవంతం కావాలని కోరుతూ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా గోడపత్రికను విడుదల చేశారు. టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.రవి ప్రసాద్ గౌడ్,డి. కృష్ణయ్య మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక హక్కులను కాపాడాలని, వీరి హక్కుల పరిరక్షణ కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులుకి కే. జ్యోతి, జిల్లా కార్యదర్శి ఎండి.హామీద్ , వెంకటయ్య, మల్లికార్జున్, యం.శరత్ తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు ఇంటర్వ్యూలు

**జనం పవర్, పెద్దపల్లి ఆగస్టు 1:** మంథని సామాజిక ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న రెండు సివిల్ అసిస్టెంట్ సర్జన్ (ఎంబీబీఎస్) కాంట్రాక్టు పోస్టుల భర్తీకి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 5న ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు సూపరిం టెం డెంట్ డా. కే. శ్రీధర్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ ప్రతులతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. ఎంపికైన వారికి రూ.52,351 గౌరవ వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. వివరాలకు కింది నంబర్లలో 84990 61999 / 94914 81481 సంప్రదించాలని సూచించారు.

## కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్

**జనం పవర్ జగిత్యాల, ఆగస్టు 1:** సారంగాపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను నేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని అన్నారు. విద్యార్థులను క్రమశిక్షణ పద్ధతిలో నడిపించాలని సూచనలు చేశారు. విద్యార్థులతో కలసి కలెక్టర్ సత్యప్రసాద్ భోజనం చేశారు. విద్యార్థులకు మంచి భోజనం అందించాలన్నారు. కస్తూర్బా గాంధీ విద్యాలయం పాఠశాలలో ఎనిమిదవ తంగతిలో విద్యార్థులకు గణిత బోధన విధానాన్ని టీచర్లా వ్యవహరించి బోధించారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులకు లీనరీ ఈక్వేషన్స్ పై సమస్యలకు సాధన బోర్డుపై చేసి సమాధానములను తెలుసుకున్నారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకి విద్యార్థులుచురుకుగా సమాదానాలు ఇవ్వడం జరిగిందన్నారు. పాఠశాలలో కిచెన్ గార్డెన్,పరిసరాలను పరిశీలించి అన్ని వసతులు బాగుండేలా అని స్పెషల్ ఆఫీసర్లను. సిబ్బందిని అధికారులకు జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, జిల్లా విద్యాధికారి రాము తహసిల్దార్. ఎంపీడీవో అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఆటో కార్మికులకు అండగా ఉంటా

### ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**జనం పవర్, వరంగల్, ఆగస్టు 1:** ఆటో కార్మికులకు అండగా ఉండి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్ పరిధిలోని చింతగట్టు క్రాస్ రోడ్డు వద్ద న్యూ కాకతీయ ఆటో యూనియన్ చింతగట్టు, మునిపల్లె, సుభాస్ నగర్ గ్రామాల ఆటో కార్మికులకు కాంగ్రెస్ నాయకులు ఏరు కొండ శ్రీనివాస్ ఆటో కార్మికులకు చొక్కాలు పంపిణీ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అథితిగా హాజరయ్యారు. తాడు అధ్యక్షుడు గుడమల్ల రవి కుమార్, ఆటో కార్మికులు ఎమ్మెల్యే నాగరాజుకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు ప్రపంచ ఆటో కార్మిక దినోత్సవం సందర్భంగా యూనియన్ ఏర్పాటు చేసిన ఆటోను నడిపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ప్రపంచ ఆటో కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వం ఆటో కార్పోరేషన్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తానని హామీలకే పరిమితమైందన్నారు. కానీ నేడు ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆటో కార్మికులకు రూ.12 వేలు ఇచ్చే సన్నహాలు చేస్తున్నారని పేర్కొన్నారు. నాడు తెలంగాణ సాధన కోసం ఉద్యమం నిర్వహించి ఆటోలు బంద్ చేసి సకల జనుల సమ్మె భాగస్వాములయ్యారన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో, హసన్‌పర్తి మండల కేంద్రంలో ఆటో కార్మిక సోదరులు ఎక్కువ స్థాయి లో ఉన్నారన్నారు. వారికి అన్ని రకాలుగా అండగా ఉంటూమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆటో కార్మికులకు అందుతాయన్నారు. గత పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఈనాడు ఆటో కార్మికులను పట్టించుకోలేదని ఆరోపించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఉచిత బస్ ప్రయాణం పెట్టీ ఆటో కార్మికుల పోట్టగొట్టారని వారిని రెచ్చ కొడుతున్నారని విమర్శించారు. కావున ఆటో కార్మిక సంఘాలు కార్మికులు మాయమాటలను నమ్మొద్దని ఎమ్మెల్యే కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాం నరసింహారెడ్డి, ఆత్మకూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, హసన్‌పర్తి పాక్స్ చైర్మన్ బిల్లా ఉదయ్ కుమార్ రెడ్డి, హసన్‌పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అయ్యాల రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 1:** జిల్లాలోని నర్సాపురం ప్రైమరీ, హైస్కూళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గుడిగందుల రవి కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏవో అబ్దుల్ రహమాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపురం గ్రామ పరిధిలో నూతనంగా నిర్మించిన డబల్ బెడ్ రూంలలో నడుస్తున్న ప్రభుత్వ ప్రైమరీ, హైస్కూళ్లను కలెక్టర్ సందర్శించాలన్నారు. మూడున్నర సంవత్సరాల నుంచి ప్రజల కోసం నిర్మించిన డబల్ బెడ్ రూం గదులలో పాఠశాలలను నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులు డబుల్ బెడ్ రూమ్ హాళ్లలో నిర్మించిన మరుగుదొడ్ల పక్కనే కూర్చుని పాఠాలు వింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగూనంగా కనీసం కూర్చోవడానికి కూడా సరిపడా స్థలం లేదన్నారు. గతంలో ఈ సమస్యల పరిష్కారం కోసం మండల, జిల్లా విద్యాధికారులకు వినతి పత్రాలు అందజేసినా ఎక్కడ వేసినా గొంగళి అక్కడే అన్నట్టు ఉందన్నారు. ఇప్పుడు కొత్తగా కొంతమంది బయట వ్యక్తులు వచ్చి పాఠశాలకు కేటాయించిన డబల్ బెడ్‌రూంలో గత ఎండా కాలం నుంచి నివసిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ అధికారుల నుంచి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఉపాధ్యాయులు రెండు తరగతుల విద్యార్థులను ఒకటే గదిలో కూర్చోబెడుతున్నారని చెప్పారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఈ పాఠశాలను సందర్శించి, ఇక్కడ తిష్ట వేసిన సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ సిద్దిపేట నాయకులు అయాజ్, అనిరుద్, ప్రకాష్ పాల్గొన్నారు.

## గొర్రెలు, మేకలకు నీలి నాలిక వ్యాధి టీకాలు



**జనం పవర్, పటాన్‌చెరు (జిన్నారం):** జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమ్మ గూడెం గ్రామంలో నీలి నాలిక వ్యాధి టీకా కార్యక్రమాన్ని చేపట్టారు. మండల పశు వైద్యాధికారి విశ్వ చైతన్య ఆధ్వర్యంలో ఆసుపత్రి సిబ్బంది మేకలకు, గొర్రెలకు టీకాలను వేశారు. అనంతరం వైద్యాధికారి మాటాడుతూ నీలి నాలిక వైరల్ వ్యాధి అని అన్నారు. ఇది ముఖ్యంగా వర్షాకాలంలో కనిపించే మశకాల ద్వారా వ్యాపిస్తుందని తెలిపారు. ఈ వ్యాధిని నిరోధించేందుకు టీకాలు అత్యంత ప్రభావవంతమైన పరిష్కారం అన్నారు. ఈ టీకా కార్యక్రమాన్ని ఈ నెల 8 వరకు అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మేకలు ,గొర్రెల పెంపకం దారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశు వైద్య సిబ్బంది బాబూలాల్, గొర్రెల పెంపకందారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజల జీవనానికి ముప్పుగా మారిన పరిశ్రమలు

**- కాలుష్య నీటితో పశువుల ప్రాణాలకు ముప్పు**

**- పట్టించుకోని పీసీబీ అధికారులు**



**జనం పవర్, పటాన్‌చెరు (గడ్డపో తారం), ఆగస్టు 1:** పటాన్‌చెరు నియోజకవర్గంలోని గడ్డపోతారం పారిశ్రామిక వాడలో రసాయనిక వ్యర్థాల వల్ల తీవ్ర కాలుష్యం నెలకొంది. వర్షాకాలంలో పరిశ్రమలు తమ వ్యర్థ జలాలను యథేచ్ఛగా బయటకు వదులుతుండటంతో, అవి స్థానిక నీటి కుంటలలోకి చేరుతున్నాయి. ఈ వ్యర్థ జలాల ప్రభావంతో నీరు ఎర్రటి రంగులోకి మారిపోయింది. దీన్ని గమనించిన గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చెరువులలోకి చేరుతున్న ఈ కాలుష్య నీటి వల్ల చేపలు మృతి చెందుతున్నాయి. అలాగే పశువులు ఈ నీటిని తాగడం వల్ల చనిపోతున్నాయి. గతంలోనూ ఇదే తరహాలో పశువులు మృతి చెందిన దుస్థితి గుర్తు చేశారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో గ్రామస్థులు పీసీబీ (పర్యావరణ పరిరక్షణ మండలి) అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. పరిశ్రమలపై తక్షణమే చర్యలు తీసుకుని, ఈ కాలుష్య సమస్యను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇకనైనా అధికార యంత్రాంగం స్పందించకపోతే పెద్ద ఎత్తున నిరసన చేపడతామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## అంగన్‌వాడీలో తల్లిపాల వారోత్సవాలు




**జనం పవర్, జుక్కల్, ఆగస్టు 1:** బిచ్కుంద మండలంలోని పుల్కల్ గ్రామ ఎస్సీ వాడా అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ సంగీత మాట్లాడుతూ తల్లి పాలు అమృతం లాంటిదన్నారు. బిచ్కుంద మండలంలోని పుల్కల్ గ్రామంలో ఎస్సీ వాడా అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ సంగీత మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల ఈ నెల 7 వరకు నిర్వహించబడుతుతాయన్నారు. తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివన్నారు. ప్రసవమైన వెంటనే ముర్రుపాలు బిడ్డకు పట్టాలని గర్భిణులకు సూచించారు. పుట్టిన వెంటనే ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి, ఇతర పదార్థాలు పుట్టిన బిడ్డకు తినిపించరాదని ఆమె పేర్కొన్నారు. తల్లులు బిడ్డలకు రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. వాళ్ల ముఖంలో ముఖం పెట్టి పాలిస్తే మన ప్రేమ అనేది పిల్లలకు ఉత్సాహంగా ఉంటుందన్నారు. ఎక్కడో టీవీ చూసుకుంటూ పాలు తాగిస్తే, ఫోన్లు మాట్లాడుకుంటూ పిల్లలకే పాలిస్తే వాళ్లు సరిగా పాలు తాగలేరన్నారు. అమ్మ పాలు బిడ్డలకు ఇస్తూ ఉంటే ఆప్యాయంగా పలకరించుకుంటూ బిడ్డకు పాలు పట్టాలని ఆమె అన్నారు. అంగనవాడీ టీచర్ గంగమ్మ మాట్లాడుతూ తల్లిపాలు పుట్టిన బిడ్డకు రెండు సంవత్సరాల వరకు ఇస్తే రొమ్ము క్యాన్సర్ రాదన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ వర్కర్ కృష్ణవేణి, గర్భిణులు, కిషోర్ బాలికలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు ఫేస్ రికగ్నిషన్‌తో పెన్షన్ పంపిణీ



**జనం పవర్, పటాన్‌చెరు (జిన్నారం):** జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని తపాలా కార్యాలయంలో పింఛను పంపిణీలో నూతన సాంకేతిక విధానాన్ని ప్రారంభించారు. శుక్రవారం నుంచి పింఛన్లను ఫేస్ రికగ్నిషన్ (ముఖచిత్ర గుర్తింపు) సాంకేతికత ద్వారా లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తపాలా అధికారులు తెలిపారు. జిన్నారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారుల ముఖచిత్రాన్ని యంత్రం సహాయంతో గుర్తించిన తర్వాతే నగదు అందజేసే ప్రక్రియ చేపట్టారు. ఈ విధానం ద్వారా బోగస్ లబ్ధిదారులపై నియంత్రణ సాధించడం, నిజమైన లబ్ధిదారులకే నిధులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తపాలా సిబ్బంది వివరించారు.

తద్వారా ఇకపై ఫేస్ రికగ్నిషన్ విధానంతోనే పెన్షన్లు అందించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తపాలా కార్యాలయ సిబ్బంది, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వీర్య కణాల సంఖ్య పెంచే ఆహారాలేంటో తెలుసా?

మానవ పుట్టుకకు వీర్య కణాలే కారణం. వీర్య కణాలు స్త్రీ అండంతో కలిస్తే బిడ్డ జన్మిస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో వంధత్వం పెరుగుతోంది. సంతాన సాఫల్యం దెబ్బతింటోంది. దీంతో చాలా మంది సంతాన లేమి సమస్యతో బాధపడుతున్నారు. గర్భధారణలో సమస్యలు తలెత్తుతున్నాయి. దంపతుల్లో సంతాన భాగ్యం కలగాలంటే వీర్య కణాలు సమర్థవంతంగా ఉండాలి. లేకపోతే సంతానం కలగడం సాధ్యం కాదు. ఫలితంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. వీర్య కణాల సంఖ్య తగ్గిపోవడానికి ప్రధాన కారణాల్లో మద్యం, పొగ తాగే అలవాటు ప్రతిబంధకంగా మారుతుంది. పొగాకు ఉత్పత్తుల్లో సుమారు 2 వేల రకాల రసాయనాలు ఉండటం వల్ల ధూమపానం సంతాన సాఫల్యత మీద పెనుప్రభావం చూపుతుంది. పురుషుల్లో ధూమపానం, మద్యపానం పలు సమస్యలను తెచ్చిపెడుతుంది. సంతాన భాగ్యం కావాలనుకునే వారు వీటికి దూరంగా ఉండటమే శ్రేయస్కరం.  వీర్య కణాల సంఖ్య తగ్గడానికి మరో కారణం ఊబకాయం. వీర్య కణాల నాణ్యతను ఊబకాయం దెబ్బతీస్తుంది. ప్రస్తుత కాలంలో ఊబకాయం సమస్యలను తెస్తుంది. ఈస్ట్రోజన్, టెస్టోస్టిరాన్, హార్మోన్ల నిష్పత్తి మీద ప్రభావం కలిగిస్తుంది. అధిక బరువు సంతాన సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. వీర్య కణాల నాణ్యత పడిపోవడానికి ఊబకాయం మరో ప్రతిబంధకంగా ఉంటుంది. నిద్రలేమి కూడా వీర్య కణాల సంఖ్య తగ్గేందుకు కారణం అవుతుంది. రోజుకు కనీసం 8 గంటలు నిద్రపోవడం వల్ల మన వీర్య కణాల సంఖ్య పెరుగుతాయి. వీర్య కణాల చలనశీలత, నాణ్యత పెరగడానికి నిద్ర ఉపయోగకరంగా ఉంటుంది. మంచి నిద్ర పోవడం వల్ల వీర్యకణాల సంఖ్య పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు. సంతాన సాఫల్యతను ప్రభావితం చేసే అంశాల్లో నిద్ర కూడా ఒకటి. వీర్య కణాల సంఖ్యను పెంచే వాటిలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, ధాన్యాలు ముఖ్యమైనవి. రోజు వీటిని తినడం వల్ల వీర్య కణాల సంఖ్య పెరిగేందుకు దోహదం అవుతుంది. ఫాస్ట్ ఫుడ్, వేపుళ్లు తగ్గించుకోవాలి. చక్కెర అధికంగా ఉండే పానీయాలు తాగొద్దు.   వాటి వల్ల కూడా నష్టమే కలుగుతుంది. ఇలాంటి ఆహారాలు తీసుకోవడం మానేయాలి.



# భోజనం చేశాకే నీళ్లు ఎందుకు తాగకూడదు?

భోజనం చేసిన తర్వాత నీళ్లు తాగడం చాలా సాధారణం. ప్రతి ఒక్కరికీ ఇదొక అలవాటు కూడా. కానీ కొందరు మాత్రం భోజనం చేసే సమయంలో నీళ్లు తాగకూడదని అంటే మరికొందరు భోజనం చేసిన తర్వాత గంట వరకు నీళ్లు తాగకూడదని మరికొందరు అంటారు. ఆయుర్వేదం కూడా ఇదే విషయం చెప్తోంది. భోజనం చేసిన వెంటనే నీళ్లు తాగకూడదని. సాధారణంగా అయితే నీరు తాగడం మనకు ఎంతో ప్రయోజనకరం. ఇది మనల్ని హైడ్రేటెడ్‌గా ఉంచడమే కాకుండా అవయవాలు సక్రమంగా తమ పని చేయడానికి దోహదపడతాయి. కానీ భోజనం చేసిన తర్వాత తాగితే మాత్రం మేలు చేయకపోగా కీడు చేస్తాయని అంటున్నారు. అసలు భోజనం తర్వాత మంచినీళ్లు ఎందుకు తాగకూడదు. నిపుణులు ఏమంటున్నారు.

**భోజనం తర్వాత నీళ్లు ఇందుకే తాగకూడదు..**

ఆయుర్వేదం చెబుతున్న ప్రకారం ఆహారం తిన్న వెంటనే నీరు త్రాగడం వల్ల జీర్ణరసాలు పలుచగా మారతాయి. దీనివల్ల జీర్ణక్రియ సవ్యంగా సాగదు. అజీర్తి వంటి సమస్యలు వస్తాయి. ఇది నిజమేనని సైన్స్ కూడా చెబుతోంది. భోజనం తిన్న వెంటనే నీరు తాగితే బరువు త్వరగా పెరుగుతారని, ఊబకాయం బారిన పడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. భోజనం చేసిన తర్వాత వెంటనే నీరు తాగడం వల్ల ఆహారాన్ని జీర్ణం చేయడానికి, జీర్ణవ్యవస్థ తీసుకునే సహజ సమయాన్ని నీరు తాగడం ద్వారా మార్చేస్తున్నట్టే లెక్క. దీనివల్ల ఊహించిన దాని కంటే ముందుగానే ఆకలి వేస్తుంది. అప్పుడు అతిగా తింటారు. కడుపు ఉబ్బరం వంటి సమస్యలు కూడా వస్తాయని చెబుతున్నారు వైద్యులు. భోజనం తర్వాత శరీరంలో చేరిన నీరు జీర్ణ ఎంజైములను పల్చగా మారుస్తుంది. దీనివల్ల ఎసిడిటీ సమస్య వస్తుంది. గుండెల్లో మంట కూడా రావచ్చు. ఆహారం తిన్న వెంటనే నీరు తాగడం వల్ల జీర్ణం కాకుండా ఆహారం చాలా వరకు మిగిలిపోతుంది. ఇది కొవ్వు రూపంలో నిల్వ అవుతుంది. ఈ ప్రక్రియ ఇన్సులిన్ స్థాయిలను అమాంతం పెంచుతాయి. దీనివల్ల మధుమేహం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. ఇక మధుమేహం ఉన్నవారు భోజనం తిన్న వెంటనే నీటిని తాగకూడదు. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి.

**ఎప్పుడు తాగాలి?**

భోజనం తినడానికి అరగంట ముందు, భోజనం తిన్న అరగంట తర్వాత నీరు తాగడం ఉత్తమం అని వివరిస్తున్నారు ఆయుర్వేద వైద్యులు. ఇది ఆహారాన్ని మృదువుగా మారుస్తుంది. అయితే చల్లటి నీటిని మాత్రం తాగకూడదు. ఎందుకంటే అన్నం తిన్న వెంటనే చల్లటి నీరు తాగడం వల్ల జీర్ణక్రియ తీవ్రంగా ప్రభావితం అవుతుంది. జీర్ణవ్యవస్థలో టాక్సిన్స్ పేరుకుపోయే అవకాశం ఉంది. యాసిడ్ రిఫ్లెక్స్ వంటి సమస్యలు కూడా రావచ్చు. అలాగే భోజనం తినేటప్పుడు కెఫీన్ నిండిన పానీయాలు, కూల్ డ్రింకులు కూడా తాగడం మానేయాలి.

